# కలం నిఘా

WWW.KALAMNIGHA.COM

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ ఆదివారం 27 అక్టోబర్ 2024

సంపుటి: 14, సంచిక: 207, పేజీలు 8, వెల: 4.00

Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam


## అమెరికా చేరుకున్న లోకేశ్

పెట్టుబడులే లక్ష్యంగా పర్యటన

2

## మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలకు ఆప్ దూరం

2

# కేటీఆర్‌కు పదేళ్ల జైలు శిక్ష

కేసీఆర్ కుటుంబ అవినీతిపై చర్యలకు సర్వత్రా డిమాండ్

## ...కూడా తక్కువే

### అవినీతి నేతలు ఎవ్వరినీ వదిలే ప్రసక్తి లేదు

- కమీషన్ల కోసమే కాళేశ్వరం నిర్మాణం
- కేబినేట్ విస్తరణ అధిష్ఠానం, సీఎం చూస్తారు
- త్వరలోనే కాంగ్రెస్ పార్టీ పునర్వ్యవస్థీకరణ
- అన్ని కేసులపైనా విచారణ సాగుతుంది
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్

న్యూఢిల్లీ అక్టోబర్ 26 (నిఘా న్యూస్) కమీషన్ల కోసమే కాళేశ్వరం నిర్మించారని ప్రపంచానికంతా తెలిసిందని, అందుకే కెసిఆర్ కుటుంబ అవినీతిపై చర్యలకు సర్వత్రా డిమాండ్ పెరుగుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అవినీతి పరులను ప్రభుత్వం వదలబోదని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కమీషన్ల కోసం కాళేశ్వరం డిజైన్ మార్చి వ్యయం పెంచారని ఆరోపించారు. కమీషన్ల కోసం కాళేశ్వరం కట్టారని ప్రజాధనం దుర్వినియోగం చేశారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ లో జరిగిన అవకతవకలపై కమిషన్ విచారణ జరపుతోందని కాళేశ్వరం వాస్తవాలు బయటకు రావాలని అన్నారు. అన్యాయంగా ప్రభుత్వం ఎవరిపైన కేసులు పెట్టదని అదే విధంగా తప్పు చేసిన ఎవరినీ వదలదని హెచ్చరించారు. రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారిన కేబినెట్ విస్తరణపై గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన శనివారం మీడియా ప్రతినిధులతో ఇష్టగోష్ఠిగా మాట్లాడారు. మంత్రివర్గ విస్తరణ ఏఐసీసీ, ముఖ్యమంత్రి కనుసన్నలలో జరుగుతుందని తాను పార్టీ వ్యవహారాలు మాత్రమే చూస్తున్నానని అన్నారు. కేబినెట్ విస్తరణ పార్టీ హై కమాండ్ చూసుకుంటుందని స్పష్టం చేశారు. త్వరలో పీసీసీ నూతన కార్యవర్గ నియామకం ఉంటుందని డీసీసీలుగా ఎమ్మెల్యేలతో పాటు సమర్థులకు కార్యవర్గంలో స్థానం ఉంటుందని అన్నారు. ఇతర పార్టీల నాయకుల చేరికలతో కొన్ని సమస్యలు తలెత్తాయని పాత కొత్త నేతలను సమన్వయం చేసుకోవాల్సి ఉందని అన్నారు. జీవన్ రెడ్డి సన్నిహితుడు మరణంతో మనస్తాపానికి లోనయ్యారని బాధతో ఆయన లేఖ రాశారన్నారు. జీవన్ రెడ్డి పార్టీలో సీనియర్ నాయకుడని.. ఆయనకు పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. రాష్ట్రంలో పొలిటికల్ బాంబు పేలుతాయంటూ మంత్రి పొంగులేటి చేసిన కామెంట్స్ స్పందిస్తూ..

..మిగతా 2లో

### గోషామహల్ పోలీస్ గ్రౌండ్స్‌లో...

## ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం

మెట్రో మార్గాల విస్తరణకు ఆమోదం

ఉద్యోగులకు రెండు డిఎల చెల్లింపు

ములుగులో గిరిజన వర్సిటీకి 211 ఎకరాలు

పలు నిర్ణయాలకు కేబినేట్ ఆమోదం

హైదరాబాద్ అక్టోబర్ 26 (నిఘా న్యూస్) రాష్ట్రంలో రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. సన్న వడ్లకు రూ.500 బోనస్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే ధాన్యం సేకరణకేంద్రాల ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదించింది. అలాగే మెట్రో రైలు విస్తరణ ప్రాజెక్టులకు కూడా కేబినేట్ ఆమోదం తెలిపింది. నాగోల్, ఎల్‌బి ఆనగర్, హయత్‌నగర్,శంషాబాద్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన శనివారం జరిగిన కేబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎన్నికల హామీలు సహా మేనిఫెస్టోపై చర్చించింది. ఇప్పటివరకూ వేసిన కేబినెట్ సబ్ కమిటీలు, వాటి నివేదికలపై చర్చించింది. ములుగు జిల్లాలో సమ్మక్క సారలమ్మ సెంట్రల్ వర్శిటీకి ఎకరానికి రూ.250 చొప్పున భూమిని కేటాయించాలని నిర్ణయించింది. అలాగే, మద్దూర్ మండల కేంద్రాన్ని మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ చేయడానికి ఆమోదం తెలిపింది. హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధి పెంపుపైనా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రేరాలో 54 ఉద్యోగాల భర్తీకి టీజీపీఎస్సీకి ఆదేశాలిచ్చింది. ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉస్మానియా ఆస్పత్రి పునఃనిర్మాణానికి గోషామహల్ పోలీస్

..మిగతా 2లో

### అమెరికాలో అక్రమంగా

## భారతీయుల తిప్పట

ప్రత్యేక విమానంలో వెనక్కి పంపిన యూఎస్ స్మగ్లర్ల చేతిలో బందీలు కాకుండా ఉండేందుకే చర్యలు

2

## ప్రపంచస్థాయి ప్రమాణాలతో స్కిల్స్ యూనివర్సిటీ క్యాంపస్

200 కోట్లతో స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణం .. ప్రభుత్వంతో మేఘా కంపెనీ ఒప్పందం

హైదరాబాద్ అక్టోబర్ 26(నిఘా న్యూస్) యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం మరో ముందడుగు పడిరది. స్కిల్స్ యూనివర్సిటీ భవన నిర్మాణానికి మేఘాఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ముందుకొచ్చింది. యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణానికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ నిధుల నుంచి రూ.200 కోట్లను మేఘా కంపెనీ కేటాయించింది. యూనివర్సిటీ క్యాంపస్‌లో అవసరమైన భవనాలన్నింటినీ నిర్మించే బాధ్యతలను మేఘా కంపెనీ స్వీకరించింది. ప్రపంచ స్థాయి అధునాతన నమూనాలతో అన్ని మౌలిక వసతులతో స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణం చేపట్టేందుకు మేఘా కంపెనీ ముందుకొచ్చింది. సచివాలయంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో మేఘా కంపెనీ ఎండీ కృష్ణారెడ్డి కంపెనీ ప్రతినిధుల బృందం చర్చలు జరిపారు. సీఎంతో పాటు చర్చల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు,

..మిగతా 2లో

## అవును నేను కలెక్టర్‌ను తిట్టాను

అయితే నేను తిట్టింది గత ప్రభుత్వంలో

పది సార్లు ఫోన్ చేసినా ఎత్తని కలెక్టర్‌ను

దండుపాళ్యం బ్యాచ్‌లా బిఆర్ఎస్ సోషల్ మీడియా

కేటీఆర్, హరీష్ రావులకు మతి భ్రమించింది

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆగ్రహం

హైదరాబాద్ అక్టోబర్ 26(నిఘా న్యూస్) బిఆర్ఎస్ సోషల్ మీడియా దండుపాళ్యం బ్యాచ్‌లా మారిందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై తప్పుడు ప్రచారం చేసిన వాళ్లను వదిలి పెట్టనని హెచ్చరించారు. తాను కలెక్టర్‌ను తిట్టినట్టు వీడియో క్రియేట్ చేసి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తనపై ట్రోల్ చేసేవాళ్లు దొరికితే బట్టలూడదీసి కొడతానన్నని జగ్గారెడ్డి వార్నింగ్ ఇచ్చారు. బిఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్ రావులపై జగ్గారెడ్డి విరుచుకు పడ్డారు. వారిద్దరికీ మతిభ్రమించిందని దుయ్యబట్టారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన అధికారం లేక కెటిఆర్, హరీశ్ రావు ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చూస్తున్నారని ఫైర యయ్యారు. ఇక, మహిళా కలెక్టర్‌పై తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఓ

..మిగతా 2లో

## రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ సభ్యత్వ నమోదు

మంగళగిరిలో ప్రారంభించిన ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి అక్టోబర్ 26 (నిఘా న్యూస్) రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఒకేసారి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని టీడీపీ అధినేత ప్రారంభించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పునః ప్రారంభించారు. సభ్యత్వ నమోదులో భాగంగా పార్టీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ రూ.100 కట్టి సీఎం చేతుల మీదుగా మ్మెదటి సభ్యత్వాన్ని తీసుకున్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని, కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉండాలని శుక్రవారం సీఎం చంద్రబాబు టీడీపీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ వందల, వేల మంది కార్యకర్తల కృషి ఫలితంగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి టీడీపీ పార్టీ సేవలు అందించగలుగుతుందని అన్నారు. ఆపద సమయంలో వారిని ఏ విధంగా ఆదుకుంటామో చేసి చూపిస్తామని సీఎం చెప్పారు. పార్టీ కోసం అనేక మంది కార్యకర్తలు, నేతలు వివిధ స్థాయిల్లో కష్టపడి పని చేశారని ఆయన చెప్పుకొచ్చారు. పార్టీ కోసం

..మిగతా 2లో

## జగన్ మోచేతి నీళ్లు తాగే వ్యక్తి వైవీ సుబ్బారెడ్డి

తల్లిని కోర్టుకు ఈడ్చే కొడుకు ఉంటాడా

వైయస్ బతికుండగానే చెప్పారు

నలుగురు మనవళ్లకు సమాన వాటా అని

ఆస్తులకు వారి పేర్లు పెట్టుకుంటే వారివే అవతాయా?

మీడియా సమావేశంలో షర్మిల కన్నీటి పర్యంతం

2

## లంచాల కోసమే మూసీ బ్యూటిఫికేషన్

మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్

2

2

### నవంబర్ 15లోగా...

## అక్రిడేషన్లకు దరఖాస్తులు చేసుకోండి

జర్నలిస్టుల విధి విధానాలపై అక్రిడేషన్లపై కమిటీ చర్చ

2

### మామునూరులో

## రోడ్డెక్కిన ఖాకీలు

టీజీఎస్పీకో హఠావో.. ఏక్ పోలీస్ బనావో

నల్లగొండ జిల్లా అన్నెపర్తిలోనూ పోలీసుల ఆందోళన

ఇబ్రహీంపట్నం, మంచిర్యాలలో ఫ్యామిలీల ధర్నా

# కేటీఆర్‌కు పదేళ్ల జైలు శిక్ష కూడా తక్కువే

మొదటి పేజీ తరువాయి...

గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడిన వారి గురించే పొంగులేటి మాట్లాడారని భావిస్తున్నానని అన్నారు. అక్కినేని ఫ్యామిలీ, సమంతపై కొండా సురేఖ మాటలను పార్టీ పరంగా సమర్ధించమన్నారు. వెంటనే కొండా సురేఖ తన మాటలు ఉపసంహరించు కున్నారని గుర్తు చేశారు. రానున్న డిసెంబర్ నెలలో కొన్ని శుభవార్తలు వింటారని మహేష్ గౌడ్ అన్నారు. మరోవైపు.. 2029 ఎన్నికలు మాకు ఫైనల్ అని.. రాష్ట్రం, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి ఉంటుందని తెలిపారు. బీసీ విషయంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కొంత డివియేట్ అవుతున్నారని ఆయనతో నేను, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్ చార్జ్ దీపదాస్ మున్సి మాట్లాడామని అన్ని సర్దుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. బీసీ కులగణనపై నవంబర్‌లో సమావేశాన్ని నిర్వహించాలని అనుకుంటున్నామని.. ఆ సమావేశానికి మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలను ఆహ్వానించామని తెలిపారు. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అవినీతిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారని కుమార్ గౌడ్ అన్నారు. వారు చేసిన తప్పులకు కేసీఆర్, కేటీఆర్‌లను రెండు, మూడేళ్లుకాదని పదేళ్ల జైలు శిక్ష కూడా తక్కువేనని అన్నారు. అలాగే విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఇప్పుడు చాలా తక్కువధరకే విద్యుత్ దొరుకుతుందని స్పష్టం చేశారు. విద్యుత్ చార్జీల పెంపు ఆలోచన లేదని అన్నారు. కేసీఆర్‌కు ఉన్న ఆర్థిక వెసులుబాటు తమకు లేదని చెప్పారు. తెలంగాణ ఏర్పడ్డప్పుడు మిగులు బడ్జెట్‌తో ఉంది, కానీ పదేళ్లలో రూ.8లక్షల కోట్లు కేసీఆర్ తెలంగాణపై అప్పు చేశారని విమర్శించారు. ఏ పథకాన్ని ఆపలేదు. త్వరలోనే పథకాలను గ్రౌండ్ చేస్తామని హామీ ఇచ్చారు. పదేళ్లలో విడుతాల వారిగా చేసిన దానికంటే తాము రుణమాఫీ చేసిన మొత్తం ఎక్కువేనని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, కేసీఆర్ చేసిన అప్పులను ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతాం, పథకాలను ఎగ్గొట్టాలనే ఆలోచన లేదని చెప్పారు. హైడ్రాలో ఒక్కటే పేదల ఇల్లు కూలిందని చెప్పారు. సోషల్ మీడియాలో అన్యైతికంగా ప్రచారం చేస్తున్నారు. విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెడుతూ పట్టుకుందమంటే పట్టుకునే వీలు లేకుండా విదేశాల్లో ఉంటూ నడుపుతున్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో యథేచ్ఛగా చెరువుల కబ్జా జరిగింది. వయనాడులో జరిగిన విధ్వంసం తెలంగాణలో జరగకూడదనే యుద్ధప్రాతిపదికన మూసీ ప్రక్షాళన చేపట్టామని వివరించారు. విడతల వారిగానే మూసీ ప్రక్షాళన చేస్తున్నాం.హైడ్రాతో పేదవారికి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటాం. హైడ్రా, మూసీపై రివ్యూ చేస్తున్నాం. పేద, మధ్యతరగతి వారికి అన్యాయం కలగకుండా చర్యలు ఉంటాయని అన్నారు. జీవో నెంబర్ 29పై ఎవరికి నష్టం జరుగదని అధికారులు చెప్పారు. మెరిట్ లిస్ట్‌లో ఎవరికి అన్యాయం జరగడం లేదు. జీవో నెంబర్ 29పై ఎవరు ఆందోళన చేశారో, ఎందుకు చేశారో తెలియడం లేదన్నారు. నెలలు అవుతుంది, ప్రతిపక్ష నేత ఎక్కడికి పోయాడు. ప్రజల సమస్యలపై కేసీఆర్ ఎందుకు బయటకు రావడం లేదు. కేసీఆర్‌కు ప్రజలు ప్రతిపక్ష నేత హోదా ఇస్తే ఆయన చేస్తున్నది ఏంటని అన్నారు. సీఎం తమ్ముడు తిరుపతి రెడ్డి ఆయన ఇల్లును కూల్చామనే చెప్పారు, కానీ కోర్టు డ్రైరెక్షన్ వల్లే కూల్చలేదు. ప్రభుత్వానికి ఎవరైనా విరాళాలు ఇవ్వొచ్చు, అదాని ఇచ్చారు అంతే. ప్రతిపక్షాల రాద్ధాంతంతో ప్రజలు ఆందోళనలో ఉన్నారు. అంతే తప్ప భవిష్యత్ తరాల కోసమే హైడ్రా, మూసీ ప్రక్షాళన అని వివరించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రభావం ఉండదు. బీఆర్ఎస్‌లో ఏముందని చేరతారు. కేసీఆర్ కనబడటం లేదు, ఎవరిని చూసి బీఆర్ఎస్‌లో చేరతారు. ఏ కేసును నీరుగార్చే ప్రయత్నం చేయడం లేదు. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్, భూ ఆక్రమణలు ఇలా అన్ని కేసుల విచారణ ఉంటుంది, ఫోన్ ట్యాపింగ్ పెద్ద వ్యవహారం. కేంద్రాచట్టలు వర్తిస్తాయి. కేసీఆర్ చేసినట్లు మేము మోసం చేయమనే క్లారిటీతో ప్రజలున్నారు. పార్టీలో ఉన్న నేతలను కాపాడుకునేందుకే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారని కొందరు చెప్పుకుంటున్నారు. త్వరలోనే మరిన్ని చేరికలు ఉంటాయి. కేటీఆర్‌తో సన్నిహితంగా ఉన్నవాళ్లే కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## అమెరికా చేరుకున్న లోకేశ్

### పెట్టుబడులే లక్ష్యంగా పర్యటన

**న్యూఢిల్లీ అక్టోబర్ 26 (నిఘా న్యూస్)** పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కో నగరానికి చేరుకున్న రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్‌కు ఎయిర్‌పోర్టులో ఐటీ సర్వ్, ఎన్ఆర్ఐ టీడీపీ ప్రతినిధులు అపూర్వ స్వాగతం పలికారు. ఏపీలో ఎన్డీఏ కూటమి "అఖండ" విజయం సాధించిన తర్వాత తొలిసారిగా అమెరికాలో లోకేష్ పర్యటిస్తున్నారు. అక్టోబర్ 25 నుంచి నవంబర్ 1వ తేదీ వరకు మంత్రి లోకేష్ అమెరికా పర్యటన సాగనుంది. ఈనెల 29న లాస్ వేగాస్ నగరంలో జరుగనున్న ఐటీ సర్వీస్ సినర్జీ 9వ సదస్సుకు మంత్రి హాజరు కానున్నారు. 31న అట్లాంటాలో ఎన్టీఆర్ ట్రస్ట్ ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో లోకేష్ పాల్గొననున్నారు. శాన్ ఫ్రాన్సిస్కోలో పారిశ్రామికవేత్తలతో మంత్రి లోకేష్ సమావేశమయ్యారు. వై2కె బూమ్ నేపథ్యంలో హైదరాబాద్, బెంగుళూరు నగరాల్లో ఐటీ శరవేగంగా అభివృద్ధి చెందిందని, ప్రస్తుతం ట్రెండిరగ్‌లో ఉన్న ఏఐ అవకాశాలను అందిపుచ్చుకోవడం ద్వారా ఆంధ్రప్రదేశ్ శరవేగంగా అభివృద్ధి సాధించబోతోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు గల అనుకూలతలు, ప్రభుత్వం అమలు చేస్తున్న ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలను మంత్రి వివరించారు. భారత్‌లో రాబోయే పాతికేళ్లలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకోబోతున్నాయని , పరిపాలనలో ఏఐ వినియోగం ద్వారా ప్రజలకు వేగవంతమైన, మెరుగైన సేవలను అందించేందుకు తాము కృషి చేస్తున్నామని తెలిపారు. నాలుగవ సారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నేతృత్వంలో యువ నాయకత్వం చురుగ్గా పని చేస్తోందన్నారు. మంత్రివర్గంలో 17 మంది కొత్తవారే ఉన్నారని.. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో మ్యాన్యుఫ్యాక్చరింగ్, రెన్యువబుల్ ఎనర్జీ, బయో ఎనర్జీ, ఆక్వా, పెట్రో కెమికల్ రంగాల్లో పెట్టుబడులకు విస్తృతమైన అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి ద్వారా పేదరిక నిర్మూలనకు సీఎం సరికొత్త పీ-4 విధానానికి శ్రీకారం చుట్టారని మంత్రి తెలిపారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు తీసువస్తామన్నారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యతతో కూడిన మానవ వనరులను అందించడానికి, తద్వారా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు విద్యారంగంలో కూడా సంస్కరణలకు శ్రీకారం చుట్టామన్నారు. నవీన ఆవిష్కరణల కోసం విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలకు ప్రాధాన్యతనిస్తూ రీసెర్చి సెంట్రిక్‌గా చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు

## మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలకు ఆప్ దూరం

**న్యూఢిల్లి అక్టోబర్ 26(నిఘా న్యూస్)** హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి ఖాతా తెరవడంలో విఫలమైన ఆమ్ ఆద్మీ పార్టీ మహారాష్ట్ర ఎన్నికల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని నిర్ణయించిందని ఆ పార్టీ నేత సంజయ్ సింగ్ తెలిపారు. మహా వికాస్ అఘాఢీ కూటమిలోని పార్టీలకు మద్దతుగా తమ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని చెప్పారు. మహారాష్ట్రతో పాటు జార్ఖండ్ విషయంలోనూ ఆమ్ ఆద్మీ పార్టీ ఇదే వైఖరి తీసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. హేమంత్ సోరెన్‌కు మద్దతుగా జార్ఖండ్ ముక్తి మోర్చాకు కేజ్రీవాల్ ప్రచారం చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. మహారాష్ట్రలోని 288 స్థానాలకు నవంబర్ 20న పోలింగ్ జరనుండగా జార్ఖండ్ 13, 20 తేదీల్లో రెండు విడతలుగా ఎన్నికలు జరగనున్నాయి. 23న ఫలితాలు వెలువడనున్నాయి. భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి పోటీగా విపక్ష పార్టీలన్నీ ఇండియా కూటమి స్థాపించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీ, గుజరాత్, హరియాణా రాష్ట్రాల్లో కాంగ్రెస్‌తో కలిసి ఆప్ పోటీ చేసింది. ఒక్క పంజాబ్‌లో మాత్రం ఒంటరిగా బరిలోకి దిగింది. ఇటీవల జరగిన హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం సొంతంగా పోటీ చేసి ఖాతా తెరవడంలో విఫలమైంది. తాజాగా మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దూరంగా నిలిచింది.

## అమెరికాలో అక్రమంగా భారతీయుల తిప్పట

**వాషింగ్టన్ అక్టోబర్ 26(నిఘా న్యూస్)** అమెరికాలో అక్రమ వలసదారులను నియంత్రించాలని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ (డీహెచ్ఎస్) ప్రయత్నిస్తుంది. ఇందులో భాగంగా తమ దేశంలో అక్రమంగా ఉంటున్న భారతీయులను వెనక్కి పంపించినట్లు డీహెచ్ఎస్ పేర్కొంది. అక్టోబరు 22న ప్రత్యేక విమానంలో వీరిని భారత్‌కు పంపినట్లు తెలిపింది. భారత ప్రభుత్వ సహకారంతోనే ఈ చర్యలు చేపట్టినట్లు అమెరికా వెల్లడించింది. 'చట్టబద్ధత లేకుండా అమెరికాలో ఉంటున్న భారతీయ పౌరులను వెనక్కి పంపాలని నిర్ణయించుకున్నాం. వలస వచ్చిన ప్రజలు స్మగ్లర్ల చేతిలో బందీలు కాకుండా ఉండేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నాం' అని డీహెచ్ఎస్ సీనియర్ అధికారి క్రిస్టీ ఎ.కనెగాల్లో పేర్కొన్నారు. గత జూన్ నెలలో ది బోర్డర్ ప్రెసిడెన్షియల్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం అమెరికా నైరుతి సరిహద్దుల్లో అనధికారిక వలసలు 55 శాతం తగ్గినట్లు డీహెచ్ఎస్ గుర్తించింది. ఈ క్రమంలోనే 2024 ఆర్థిక సంవత్సరంలో దాదాపు లక్షా 60 వేల మంది అక్రమ వలసదారులను వెనక్కి పంపినట్లు తెలిపింది. 495కు పైగా ప్రత్యేక విమానాల్లో 145 దేశాలకు చెందిన వలసదారులను వెనక్కి పంపింది. వీరిలో భారత్‌తో పాటు కొలంబియా, ఈక్వెడార్, పెరూ, ఈజిప్ట్, మారిటానియా, సెనెగల్, ఉజ్బెకిస్థాన్, చైనా దేశాల పౌరులు ఉన్నారు. ఈ చర్యలు కఠినమైన సరిహద్దు సమస్యలను పరిష్కరించడం, అక్రమ వలసలను నియంత్రించడంతో పాటు చట్టబద్ధమైన వలసల మార్గాలను ప్రోత్సహించేందుకేనని అమెరికా వెల్లడించింది.

# జగన్ మోచేతి నీళ్లు తాగే వ్యక్తి వైవీ సుబ్బారెడ్డి

**విజయవాడ అక్టోబర్ 26 (నిఘా న్యూస్)** వైవీ సుబ్బారెడ్డి.. జగన్ మోచేతి నీళ్లు తాగే వ్యక్తి అని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. అన్ని కుటుంబాల్లో ఉంటే వ్యవహారం అంటూ తమ ఆస్తులపై జగన్ చేసిన వ్యాఖ్యలపై షర్మిల మండిపడ్డారు. తల్లిపై కేసులు పెట్టి కోర్టుకు లాగడం ఎక్కడైనా ఉందా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎమోషన్‌కు గురైన షర్మిల కన్నీటి పర్యంత అయ్యారు. విజయవాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ సుబ్బారెడ్డి వ్యాఖ్యపై స్పందించారు. నా బిడ్డలు కూడా మీ కళ్ల ముందే పెరిగారు.వారికి అన్యాయం చేయాలని ఎలా అనిపించింది. అన్ని విషయాలు తెలిసి కూడా బాబాయి ఎందుకిలా మాట్లాడుతున్నారు' అని కన్నీటి పర్యంతమయ్యారు. జగన్ పదవులు ఇస్తే సుబ్బారెడ్డి అనుభవిస్తున్నారు.. ఆయన అలా మాట్లాడకపోతే ఇంకెలా మాట్లాడుతారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు సుబ్బారెడ్డి, ఆయన కుమారుడు ఆర్థికంగా లాభపడ్డారు. సుబ్బారెడ్డే కాదు. సాయిరెడ్డి కూడా అలాగే మాట్లాడొచ్చు. ఎందుకంటే ఆయన కూడా వాళ్ల టీమ్‌లోనే ఉన్నారు. జగన్ పక్కన వాళ్లు ఉన్నారని తెలిసి కూడా నిన్న రాసిన లేఖలో వాళ్ల పేర్లు ప్రస్తావించాను. నేను చెబుతున్నది నిజమని ప్రమాణం చేయగలను. సుబ్బారెడ్డి చెబుతున్నది కూడా నిజమని ఆయన ప్రమాణం చేయగలరా నలుగురు మనవళ్లకు ఆస్తిలో సమాన వాటా అని రాజశేఖర్‌రెడ్డి బ్రతికుండగానే చెప్పారు. ఇది నిజం. నా బిడ్డలమీద ప్రమాణం చేసి చెబుతున్నా. ఇది నిజం కాదని, సుబ్బారెడ్డి, జగన్ ఇద్దరూ వారి బిడ్డలపై ప్రమాణం చేసి చెప్పగలరా నాకు రావాల్సిన ఆస్తిలో వాటా ఇవ్వకుండా ఏవో చెబితే ఎలా నా మేలు కోరతానని వైఎస్‌కు జగన్ మాట ఇచ్చారు. సాక్షిలో, భారతి సిమెంట్స్‌లో వాటాలు మావని జగన్ ఎలా చెబుతారు. కంపెనీలకు భారతి, జగతి అని వాళ్ల పేర్లు పెట్టుకున్నారట. ఆరోజు ఆ పేర్లు పెట్టుకోగలిగారంటే కారణం. రాజశేఖర్‌రెడ్డి అనుమతిచ్చారు, నేను అడ్డు చెప్పలేదు కాబట్టే. పేర్లు పెట్టుకున్నంత మాత్రాన ఆస్తులు మొత్తం వారివే అనే రూల్ ఏమైనా ఉందా ఆస్తులు మొత్తం జగన్‌వే కాబట్టి ఆయన జైలుకు వెళ్లారని సుబ్బారెడ్డి చెబుతున్నారు. భారతి పేరు మీద ఆస్తులు ఉంటే ఆమె ఎందుకు జైలుకు వెళ్లలేదు? ఎవరైనా గిఫ్ట్ ఇస్తే ఎంవోయూ రాసుకుంటారా. మీరు ఎంవోయూ రాశారంటేనే ఇవ్వాల్సిన బాధ్యత ఉందని అర్థం. దీనికి సుబ్బారెడ్డి సమాధానం చెప్పాలి. కన్నతల్లిపై కేసు వేసిన వ్యక్తి ఈ లోకంలో ఎవరైనా ఉన్నారా ఇలాంటి గొడవలు అందరి ఇళ్లలో ఉండేవే అని అని సునాయాసంగా మాట్లాడుతున్నారు. మీకు మానవత్వం లేదా. ఎవరో మాట్లాడితే బాధపడేదాన్ని కాదు. సుబ్బారెడ్డి మాట్లాడే వరకు చాలా బాధపడ్డా. కళ్లలో నీళ్లు తిరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ కోసం నేను, అమ్మ ఎంతో కష్టపడ్డాం. ఐదేళ్లుగా ఎంవోయూ నా దగ్గర ఉన్నా ఒక్క మీడియా హౌస్‌కు వెళ్లలేదు. ఎన్ని కష్టాలు వచ్చినా ఎంవోయూ వాడుకోలేదు. ఎక్కడా బయట పెట్టలేదు. వైఎస్ కుటుంబం గురించి చెడ్డగా చెప్పుకొంటారనే ఎంవోయూ గురించి ఎప్పుడూ చెప్పలేదు. జగన్ కోసం రెండు ఎన్నికల్లో పాదయాత్ర చేశాను. చెల్లి కోసం ఇది చేశానని జగన్ జన్మలో ఒక్కట్కైనా చెప్పగలరా జగన్ బెయిల్ రద్దవుతుంది కాబట్టి కోర్టులో కేసు వేశామని చెబుతున్నారు. తనకి లాభం జరుగుతుంది అంటే తల్లిని కోర్టుకు ఈడుస్తారా సొంత కుమారుడే తల్లిని కోర్టుకు లాగడం దారుణం కాదా రాజశేఖర్‌రెడ్డి పేరు ఎఫ్ఐఆర్‌లో లేకపోతే, కేసు నుంచి జగన్ బయటపడటం అసాధ్యమని భావించి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మూడు కోర్టుల చుట్టూ తిరిగి రాజశేఖర్‌రెడ్డి పేరును సీబీఐ ఎఫ్ఐఆర్‌లో చేర్పించారు. తనకు లాభం జరుగుతుందనుకుంటే ఎంతటివారిన్కైనా జగన్ అణచివేస్తారు. విజయమ్మను కోర్టుకు లాగడానికి కారణం ఎవరు. మీ నాయకుడు ఎలాంటి వాడో వైకాపా శ్రేణులు ఆలోచించాలి. జగన్ లాంటి వ్యక్తి నాయకుడో, శాడిస్టో వైకాపా నేతలు అర్థం చేసుకోవాలి. నేనేం తప్పు చేశానో చెప్పాలని వైకాపా నేతలు, కార్యకర్తల్ని అడుగుతున్నా అని షర్మిల అన్నారు.

# మామునూరులో రోడ్డెక్కిన ఖాకీలు

### టీజీఎస్పీకో హఠావో.. ఏక్ పోలీస్ బనావో
### నల్లగొండ జిల్లా అన్నెపర్తిలోనూ పోలీసుల ఆందోళన
### ఇబ్రహీంపట్నం, మంచిర్యాలలో ఫ్యామిలీల ధర్నా

**హైదరాబాద్ అక్టోబర్ 26 (నిఘా న్యూస్)** రాష్ట్రంలో ఏక్ పోలీస్ విధానాన్ని అమలు చేయాలంటూ నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల ధన,మాన, ప్రాణాలు రక్షించాల్సిన పోలీసులే ఏకంగా రొడ్డెక్కుతున్నారు. వరంగల్ జిల్లా మమూనూరు క్యాంపులో మొదల్కైన ఆందోళన సెక్రటేరియట్ చేరింది. క్రమంగా రాష్ట్రంలోని అన్ని బెటాలియన్లకు పాకుతోంది. అయితే ఇవాళ మామునూరు బెటాలియన్ ఆవరణలో ఏకంగా యూనిఫాం ధరించిన పోలీసులే నిరసనకు దిగారు. టీజీఎస్పీ వద్దు ఏక్ పోలీస్ ముద్దు, టీజీఎస్పీకో హఠావో.. ఏక్ పోలీస్ బనావో అంటూ నినాదాలు చేశారు. అటు నల్లగొండ జిల్లా అన్నెపర్తి బెటాలియన్‌లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంపై కానిస్టేబుళ్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లగొండ రూరల్ ఎస్సై సైదాబాబును సస్పెండ్ చేయాలని నిరసనకు దిగారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ కుటుంబ సభ్యుల మీద అసభ్యకరంగా నోటికి వచ్చినట్టు మాట్లాడారని ఆరోపించారు. తక్షణమే సైదా బాబుని సస్పెండ్ చేయాలని, లేనట్లయితే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. అయితే బందోబస్తు విధుల్లో ఉన్న సైదాబాబు వద్దకు కానిస్టేబుళ్లు రావడంతో బెటాలియన్ అధికారులు అతడిని అక్కడిని నుంచి పంపించేశారు. ఏకంగా యూనిఫాంలో ఉన్న పోలీసులే ఆందోళనకు దిగడం హాట్ టాపిక్ గా మారింది. ఈ పరిణామం రాష్ట్ర పోలీసుశాఖను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. చాలా కాలంగా ఈ విధానం అమల్లోనే ఉన్నా ఇప్పుడే పోలీసులు ఎందుకు ఆందోళన చేస్తున్నారనే చర్చ మొదల్కైంది. ఏక్ పోలీస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బెటాలియన్ల వద్ద ఇవాళ కూడా ఆందోళనలు చోటు చేసుకున్నాయి. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని బెటాలియన్ వద్ద కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులు ఆందోళన చేశాయి. అటు మంచిర్యాల జిల్లా గుడిపేట్ బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబాలు జిల్లా కేంద్రంలోని ఓవర్ బ్రిడ్జిపై ఆందోళనకు దిగాయి. బ్రిటీష్ కాలం నాటి మాన్యువల్ ఇప్పటికీ నడుస్తోందని, దానిని రద్దు చేయాలని, తమిళనాడు లాంటి సంస్కరణలు తీసుకు రావాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీసు బెటాలియన్లు 13 ఉన్నాయి. ఒక్కో బెటాలియన్ లో సగటున 1,500 మంది విధులు నిర్వర్తిస్తారు. ఇందులో 200 మంది జిల్లా కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తారు. మిగతా 1300 మంది బెటాలియన్ పరిధిలోని పోలీసు స్టేషన్లలో రొటేషన్ గా మూడు నెలల పాటు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. వీళ్లు ఇలా అన్ని పోలీస్ స్టేషన్లకు రొటేట్ అవుతూ ఉంటారు. అంటే ఒక్కో కానిస్టేబుల్ ఏడాదిలో కనీసం మూడు పోలీసు స్టేషన్లకు తిరగాల్సి ఉంటుంది. ఇలా తిరగడం వల్ల తమ భర్తలు కుటుంబాలకు దూరంగా ఉంటున్నారని కానిస్టేబుళ్ల భార్యలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఒక్క జిల్లాలో మూడు నుంచి ఐదేండ్ల పాటు పనిచేసేలా వెసులు బాటు కల్పించాలని డిమాండ్ చేస్తున్నాయి. మిగతా సివిల్ కానిస్టేబుళ్ల మాదిరిగానే తమకూ సెలవులు, బదిలీలు ఉండే విధానాన్ని తీసుకు రావాలని ఆ కుటుంబాలు డిమాండ్ చేస్తున్నాయి.

## నవంబర్ 15లోగా... అక్రిడేషన్లకు దరఖాస్తులు చేసుకోండి

**హైదరాబాద్ అక్టోబర్26 (నిఘా న్యూస్)** రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులకు అక్రెడిటేషన మంజూరికి అవసరమైన విధి విధానాలు, మార్గదర్శకాలు రూపొందించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ, ప్రథమ సమావేశం శనివారం, బూర్గుల రామకృష్ణారావు భవనంలో జరిగింది. మీడియా అకాడమీ చైర్మన్ కె .శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిటీ సభ్యులు ఆంధ్రజ్యోతి ఎడిటర్, కె.శ్రీనివాస్ , సియాసత్ న్యూస్ ఎడిటర్, ఎమ్మెల్సీ, అమీర్ అలీ ఖాన్, హిందూ పొలిటికల్ ఎడిటర్, ఆర్ రవికాంత్ రెడ్డి, సీనియర్ ఫోటో జర్నలిస్ట్, కె .నరహరి, సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ డి.యస్. జగన్ పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్ర హైకోర్టు తీర్పులు, నూతన మార్గదర్శకాలు, వివిధ రాష్ట్రాలలో అమలులో ఉన్న అక్రిడిటేషన్ కమిటీ నిబంధనలను, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు ఇతర మీడియాకు అక్రిడిటేషన్ల అంశాలపై ప్రాథమికంగా చర్చించింది. రాష్ట్రంలో నూతన మార్గదర్శకాలపై జర్నలిస్టు యూనియన్లు/అసోసియేషన్లు, ప్రెస్ క్లబ్బులు, వ్యక్తుల నుండి ప్రత్యేక కమిటీకి రాతపూర్వకమైన సలహాలు, సూచనలను ఆహ్వానించింది. నవంబర్ 15లోగా వాటిని సమాచార పౌర సంబంధాల శాఖ, జాయింట్ డైరెక్టర్‌కు అందజేయాల్సిందిగా కోరింది.

## రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ సభ్యత్వ నమోదు

మొదటి పేజీ తరువాయి...

పోరాడి అనేక కేసులు పెట్టించుకున్నారని, జైలుకు వెళ్లారని, ఆస్తులు పోగొట్టుకున్నారని చంద్రబాబు తెలిపారు. అలాంటి వారికి కచ్చితంగా టీడీపీ పార్టీ అండగా నిలబడుతుందని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల్కైన పలువురు కార్యకర్తలతో ఆయన దృశ్య మాధ్యమం ద్వారా మాట్లాడారు. గతంలో ఇన్స్యూరెన్స్ రాని 73 మందికి రూ.2లక్షల చొప్పున చంద్రబాబు అందించారు. ఈ మేరకు నేడు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పునఃప్రారంభించారు. రూ.100లు కట్టి సభ్యత్వం తీసుకుంటే రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ ప్రమాద బీమా వర్తిస్తుంది. రూ.లక్ష కడితే పార్టీలో శాశ్వత సభ్యత్వం లభిస్తుంది. ప్రమాదవశాత్తూ చనిపోతే మట్టి ఖర్చుల కింద రూ.10 వేలు తక్షణసాయం అందజేస్తారు. అలాగే బాధిత కుటుంబ సభ్యులకు విద్య, వైద్యం, ఉపాధి కోసం ఆర్థికసాయం అందిస్తారు. మరోవైపు కర్నూలు జిల్లా టీడీపీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రూ.లక్ష కట్టి మంత్రి భరత్ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. సభ్యత్వ నమోదులో జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచేలా కార్యకర్తలు, నేతలు కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. సభ్యత్వం తీసుకున్న వారికి అనేక ప్రయోజనాలు ఉంటాయని, ఆపద సమయంలో పార్టీ అండగా నిలబడుతుందని ఆయన హామీ ఇచ్చారు. బాపట్ల జిల్లా సంతమాగులూరులో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ప్రారంభించారు.

# లంచాల కోసమే మూసీ బ్యూటిఫికేషన్

**హైదరాబాద్ అక్టోబర్ 26(నిఘా న్యూస్)** సీఎం రేవంత్ రెడ్డి మూసీ బ్యూటిఫికేషన్ చేస్తాననేది కేవలం డబ్బు సంచులు నింపుకోవడానికేనని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ మరోమారు ఆరోపించారు. ఇప్పటివరకు నిర్మించిన మురుగు శుద్ధి కేంద్రాలు(ఎస్టీపీ)లను ప్రారంభించే తెలివి సీఎంకు లేదని దుయ్యబట్టారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని టీకేఆర్ కాలనీలో మూసీ పరివాహక ప్రాంతాన్ని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి పరిశీలించారు. ప్రజలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్న ఈటల, ప్రజల దృష్టి మళ్లించేందుకే హైడ్రా, మూసీ పేరుతో కొత్త నాటకాలకు తెర లేపారన్నారు. పేదలకు అన్యాయం చేసి పెట్టుబడిదారులకు వత్తాసు పలకడం సీఎం రేవంత్ రెడ్డికే చెల్లిందని ఎద్దేవా చేశారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ నిజస్వరూపం తెలిసేందుకు ఆరేళ్లు పడితే, రేవంత్ దుర్బుద్ధి ఆరు నెలల్లోనే బయట పడిరదన్నారు. ఇష్టా రీతిన వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పాలనకు మంచి రోజులు ముగిశాయన్నారు. మూసీ ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదన్నారు. మూసీలో విషపదార్థాలు, రసాయనాలు చేరకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## నేడు ఉప్పల్ కురుమ సంఘం ఎన్నికలు

**ఉప్పల్, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** ఉప్పల్ కురుమ సంఘం ఎన్నికలు నేటి ఆదివారం బీరప్పస్వామి కళ్యాణ మండపం ప్రాంగణంలో కురుమ సంఘం ఎన్నికలు జరగనున్నాయి. కురుమ యువత, కురుమ మహిళా కమిటీ, కురుమ ఉద్యోగ కమిటీ, పంచాయతీ కమిటీలను కుల పెద్దల సమక్షంలో ఎన్నుకుంటారని తెలిపారు. కురుమ సంఘం పెద్దలు వచ్చి తమ తమ అమూల్యమైన సలహా సూచనలు ఇవ్వాల్సిందిగా కోరారు. ఎన్నికల నిర్వాహకులుగా గొరిగే క్రిష్ణ కురుమ రాష్ట్ర కురుమ సంఘం ఎన్నికల అధికారి, ప్రొఫెసర్ రామాంజనేయులు కురుమ, డాక్టర్ కంకల్ల ఎలెందర్ కురుమలు వ్యవహరిస్తారని కురుమ సంఘం ప్రతినిధులు తెలిపారు.

## పోలీస్ వ్యవస్థ పై విద్యార్థులకు అవగాహన

### తుఫాన్ పోలీస్ స్టేషన్ లో ఓపెన్ హౌస్

**తూప్రాన్, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** సమాజానికి పోలీసులకు మధ్య ఉన్న సత్సంబంధాల గూర్చి పోలీస్ వ్యవస్థ ప్రజాస్వామ్యంలో పోషిస్తున్న పాత్ర గురించి వారు ఉపయోగించే వేపన్స్ గురించి మెదక్ జిల్లా తూప్రాన్ పోలీస్ డివిజన్ కార్యాలయంలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. డిఎస్పి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొని వారు చెప్పిన ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పోలీసులు వ్యవస్థకు ఏ విధంగా సేవ చేస్తున్నారో వాడే వెపన్స్ ఏ విధంగా ఉపయోగిస్తున్నారో వాటిని ఎప్పుడు, ఎక్కడ, ఎందుకు ఉపయోగించాలో విద్యార్థులకు డిఎస్పి వెంక రెడ్డి, సిఐ రంగ కృష్ణ ఎస్ఐ శివానందం లు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు, పాఠశాల విద్యార్థులు, పాల్గొని విజయవంతం చేశారు.

## ముస్తా పేట్ లో మత్తు పదార్థాలపై అవగాహన

**నారాయణపేట, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల కేంద్రంలోని ముస్తా పేట్ గ్రామములో శనివారం పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలో మందు గుట్కా సిగరెట్ ను నిషేధించాలని అవగాహన సదస్సులో పాల్గొన్న దామరగిద్ద సి హెచ్ ఓ,నారాయణ సూపర్వైజర్ కిష్టమ్మ ఏఎన్ఎం సిస్టర్ ఆశ వర్కర్లు అంగన్వాడీ ఉపాధ్యాయులు గ్రామ పంచాయతీ కార్యదర్శి భాగ్యశ్రీ మాజీ సర్పంచ్ లాలు మాజీ ఎంపిటిసి విద్యా కమిటీ మాజీ చైర్మన్ నరసింహులు ప్రజా ప్రతినిధులు గ్రామ ప్రజలు భారీ ఎత్తున తరలి వచ్చారు మాజీ సర్పంచ్ లాలు మాట్లాడుతూ యువత గుట్కా పాన్ మసాలా సిగరెట్ మద్యం కు దూరం ఉండాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఆర్టీసీలో కారుణ్య నియామకాలు

**శ్రీకాకుళం, అక్టోబరు 26 (నిఘా న్యూస్):** ఆర్టీసీలో కండక్టర్లుగా బాగా పని చేసుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ తెలిపారు. శనివారం జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో తండ్రి, భర్తలు వివిధ కారణాల వలన మృతి చెందిన నలుగురికి నియామక పత్రాలు ఆయన అందజేశారు. ఇందులో ఎం.సుగుణమణి (భర్త కె.కాంతారావు డ్రైవర్), ఎం.ఎల్.నారాయణ (తండ్రి ఎం.ఎం.రావు, డ్రైవర్), ఎస్. సంజయ్ (తండ్రి ఎస్.జి.మూర్తి, డ్రైవర్),డి.వినయ్ కుమార్ (తండ్రి బి.పి.రావు డ్రైవర్)లకు కారుణ్య నియామకాల కింద కండక్టర్ ఉద్యోగానికి నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ అధికారి ఎస్పి కృష్ణవేణి, సీనియర్ అసిస్టెంట్ ఎంకె.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ ఛానల్ ద్వారా అవయవాల తరలింపు

- 130 కిలోమీటర్ల గ్రీన్ ఛానెల్‌ని రూపొందించిన పోలీసులు
- జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి

**శ్రీకాకుళం, అక్టోబరు 26 (నిఘా న్యూస్):** శ్రీకాకుళం జిల్లాలోని రాగోలు జేమ్స్ హాస్పిటల్ నుంచి హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రికి అవయవాలను తరలించేందుకు విశాఖపట్నం ఎయిర్పోర్ట్ వరకు ఎలాంటి ఆటంకం లేకుండా శ్రీకాకుళం పట్టణ పోలీసులు శుక్రవారం గ్రీన్ ఛానెల్‌ని రూపొందించారు. జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి ఉత్తర్వులు మేరకు డిఎస్పి సిహెచ్ వివేకానంద పర్యవేక్షణ లో శ్రీకాకుళం రూరల్ సీఐ పైడిపు నాయుడు, ఎస్ఐ.రాము, ట్రాఫిక్ సిఐ నాగరాజు, ఇతర పోలీసు అధికారుల సమన్వయంతో పటిష్ట బందోబస్తు నడుమ సకాలంలో విశాఖపట్నం ఎయిర్పోర్ట్ కు అవయవాలు సురక్షితంగా చేరుకున్నాయి. ఈ నెల 24వ తేదీన జగదీష్ అనే వ్యక్తి బ్రెయిన్ డెడ్ తో మరణించడంతో అవయవాలు కుటుంబ సభ్యుల అంగీకారంతో జేమ్స్ హాస్పిటల్ వైద్యుల సహకారంతో అంబులెన్స్ పోలీస్ ఎస్కార్ట్ తో రాగోలు జేమ్స్ హాస్పిటల్ వద్ద నుంచి ఉదయం 10.15 గంటలకు ప్రారంభమైంది. ఈ ఎస్కార్ట్ ఎటువంటి ఆటంకం లేకుండా సరైన సమయానికి చేరుకునేందుకు జిల్లా ఎస్పీ కే.వీ.మహేశ్వర రెడ్డి విజయనగరం, విశాఖపట్నం పోలీసు అధికారులు సమన్వయంతో మార్గ మధ్యలో పోలీస్ సిబ్బందిని నియమించి ట్రాఫిక్ సమస్యలు లేకుండ సక్రమంగా చేరుకున్నందుకు చర్యలు చేపట్టారు. ఈ కాన్వాయ్ రాగోలు, కొత్తరోడ్డు, జాతీయ రహదారిపై మీదుగా సుమారు 130 కిలోమీటర్లు దూరం గ్రీన్ ఛానల్ ద్వారా విశాఖపట్నం ఎయిర్పోర్ట్ కు సకాలంలో సురక్షితంగా చేరుకుంది. మరణించిన వ్యక్తి యొక్క అవయవాలను వేరే వ్యక్తికి మార్పిడి చేసి మరొకరి ప్రాణాలు నిలిపేందుకు సకాలంలో అవయవాలు గ్రీన్ ఛానల్ ద్వారా రవాణా జరిగేందుకు జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి తీసుకున్న ప్రత్యేక చొరవకు జేమ్స్ హాస్పిటల్ వైద్యాధికారులు జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.

# స్వచ్ఛ ఆంధ్ర.. క్లాప్ డ్రైవర్ సమస్యలు పరిష్కరించాలి

**శ్రీకాకుళం, అక్టోబరు 26 (నిఘా న్యూస్):** ఏపీ స్వచ్ఛ్ ఆంధ్ర క్లాప్ వెహికల్ డ్రైవర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో శనివారం శ్రీకాకుళం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు టి.తిరుపతిరావు మున్సిపల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కళ్యాణి. అప్పలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్లాప్ డ్రైవర్లు అందరికీ నూతన టెక్నికల్ వేజెస్ బోర్డు నిర్ణయించిన మేరకు క్లాప్ డ్రైవర్లకు నైపుణ్యత కూడినటువంటి హైస్కూల్ వేతనాలు చెల్లించాలని, ప్రతి నెల 10వ తేదీలోగా జీతాలు ఇవ్వాలని, యూనిఫామ్, కాస్మోటిక్స్ ఇవ్వాలని, వారాంతపు సెలవు, పండుగ సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పిఎఫ్,ఈఎస్ఐ లో ఉన్న సాంకేతిక లోపాలు సరిచేసి వారి ఖాతాలో డబ్బు జమ చేయాలని,సాయి పావని ఏజెన్సీ కాంట్రాక్టర్ వచ్చి యూనియన్ నాయకులతో చర్చలు జరపాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కె.వేణుగోపాల్, క్లాప్ డ్రైవర్ యూనియన్ అధ్యక్షుడు బలగ. తేజ, కమిటీ సభ్యులు శశి, గణేష్, రాజు, సూపర్వైజర్ సంఘ అధ్యక్షుడు ముద్దాడ రామారావు, మున్సిపల్ యూనియన్ నాయకులు జె.గురుమూర్తి, ఎన్.పార్థసారథి, ఆర్.గణేష్, అర్జీ.పెద్ద మని, రామచంద్ర పి.సురేష్, అర్జీ, గణేష్, సోగ్గాడు, తారక, సోషల్ మీడియా ప్రతినిధి అరుగుల రమణ, తంగి.నారాయణ రావు, వై.కోటి తదితరులు పాల్గొన్నారు.

# ఏబీవీపీ నూతన కార్యదర్శిగా బొట్టు రాకేష్

**తూప్రాన్, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తూప్రాన్ శాఖ ముఖ్య కార్యకర్తల సమావేశం నూతన నగర కమిటీ సన్నాహక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండారి ప్రశాంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ జాతీయ పునర్నిర్మాణం జాతీయ భావాలను నింపుతున్న విద్యార్థి పరిషత్ గుర్చి దిశా నిర్దేశం చేశారు. అనంతరం నగర కార్యవర్గాన్ని ప్రకటించారు. ఇందులో భాగంగా నూతన నగర కార్యదర్శిగా రాకేష్, నగర సంయుక్త కార్యదర్శిలుగా అబ్బు, సాయిరాం, ధరణి, సుదర్శన్ లను నియమించారు. మహిళా కన్వీనర్ గా నందిని, ఎస్.ఎఫ్.డి.కన్వీనర్ గా ఎల్లం, సోషల్ మీడియా కన్వీనర్ ఆంజనేయులు, వర్షిత్, కళమంచ్ కన్వీనర్ గా సింధును నియమించారు. ఈ సందర్భంగా నూతన నగర కార్యదర్శి రాకేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యత విద్యార్థుల సమస్యల పైన నిరంతరం పనిచేస్తానని తనకి నగర కార్యదర్శిగా బాధ్యత అప్పగించిన తూప్రాన్ శాఖ కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు భరత్, కార్తీక్, మహేష్, నాని, భానుప్రియ, తదితరులు పాల్గొన్నారు.

# ధార్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

### తితిదే కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి

**ఆళ్లగడ్డ, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** ధార్మిక చింతన తోనే మానసిక ప్రశాంతత సాధ్యమవుతుందని, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆళ్ళగడ్డ మండలం, బాచేపల్లి గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం నందు గత ఐదు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు శనివారం ఎస్సీ కాలనీలోని శ్రీ రామాలయం నందు ముగిశాయి. మూడు రోజులపాటు శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై ధార్మిక ప్రవచనాలు, ప్రతి రోజు స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు, శుక్రవారం గోపూజ కుంకుమార్చన, శనివారం భజన, హరికథా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెల్లాల రఘునాథ శర్మ, అర్చకులు పుల్లయ్య శర్మ, సర్పంచ్ నాగేంద్ర, ఎంపిటిసి. సభ్యులు ధర్మ ప్రచార మండలి సభ్యులు కశెట్టి నాగేశ్వరరావు, టివి.వీరాంజనేయ రావు, కశెట్టి నాగిరెడ్డి, రాటాల శ్రీనివాసులు, బద్రి వరసయ్య, పాములేటి, రాటాల లక్ష్మీ నారాయణ, పాపగారి నరసింహారావు, భద్రి నరసింహుడు, తెలుగు లింగమయ్య, శీలం హరినాథ రెడ్డి, శీలం రామేశ్వర రెడ్డి, గొల్ల శ్రీరాములు, కల్లూరి తిరిపేలు గుండా నరసింహయ్య తోటంశెట్టి సుబ్రహ్మణ్యంతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# టిడిపి క్రియాశీలక సభ్యత్వ నమోదు పండగలా జరగాలి

### నంద్యాల ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

**ప్రొద్దుటూరు, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** టిడిపి క్రియాశీలక సభ్యత్వ నమోదుకు శ్రేణులు ముందుండాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. శనివారం నెహ్రూరోడ్డు లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి వారి సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకున్నారు. అనంతరం పార్టీ సభ్యత్వాలు నియోజకవర్గంలో పెద్దఎత్తున జరపాలని అందరు కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 100 రూపాయలతో పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి 5 లక్షల ప్రమాద భీమా వర్తిస్తుందని, కార్యకర్తల కుటుంబాలకు వారిపిల్లల చదువుకు ఆర్థిక సాయం తదితర విషయాలకు పార్టీ అండగా ఉంటుందని వివరించారు. కావున పార్టీ శ్రేణులు ప్రజలు అధిక సంఖ్యలో సభ్యత్వాలు పొందేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, తెదేపా రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు ఆసం రఘురామిరెడ్డి, వియస్ ముక్తియార్, టిడిపి సీనియర్ నాయకులు ఇవి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వారి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన వీరాచారి

**నిజాంపేట్, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** సంగారెడ్డి జిల్లా కొత్తపల్లిలో శనివారం (ఐకెపి) సెంటర్ వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సీసీ వీరాచారి మాట్లాడుతూ రైతులు వడ్లు తేమశాతం వచ్చే విధంగా వడ్లు ఆరబెట్టుకోవాలి అలాగే దొడ్డు వడ్లకు కనీస మద్దతు ధర 2320రూ సన్న వడ్లకు 2320 బోనస్ ం500 రూ.మొత్తం కలిపి రూ.2820. అదేవిధంగా వడ్లు కాంట అయ్యాక రైతులకు సమస్య రానివ్వకుండా తొందరగా ట్యాబ్ ఎంట్రీ చేస్తాం 72 గంటల్లో రైతు ఖాతాలో డబ్బులు జమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఈఓ వంశీకృష్ణ ఐకెపి వివో రమేష్ పంచాయతీ సెక్రెటరీ పొమ్మ నాయక్ డ్వాక్రా గ్రూప్ మెంబర్ భూమవ్వ, స్కూల్ మాజీ చైర్మన్ నగేష్ కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్. డీలర్ సాయిలు కే .సంగయ్య, దేవయ్య కురుమ కిష్టయ్య, కాశబోయిన రమేష్ కిషన్ సంగయ్య సాయిలు సంగయ్య కురుమ నవీన్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

## శివాలయ పునర్నిర్మాణం కోసం ఐదు లక్షల విరాళం

### గ్రామ పెద్దల సమక్షంలో దేవసాని బాలచందర్ ప్రకటన

**చిలుకా నగర్, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** చిల్కానగర్ శివాలయం పునర్నిర్మాణం కోసం గ్రామ పెద్దలు దేవసాని బాలచందర్ చంద్రకళ దంపతులు హరిహర క్షేత్రం కమిటీ అధ్యక్షులు దాసరి కృష్ణ, కమిటీ సభ్యుల సమక్షంలో గుడి నిర్మాణానికి 5,11,116 రూపాయల విరాళం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో హరి హర క్షేత్రం శివాలయం అధ్యక్షులు దాసరి కృష్ణ, కమిటీ సభ్యులు గోనే శ్రీకాంత్, బూర్గుల రమేష్, గోనే అంజయ్య, బోడ విద్యాసాగర్, షామీర్పేట చంద్రయ్య, ఆడెపు అంజయ్య, సంఘీ స్వామి యాదవ్, అమృత రావు, శంభు ప్రసాద్, ఓర్సు శేఖర్, కావలి నరసింహ, కృష్ణ ముదిరాజ్, పెండెం నాగార్జున, చోటే మియా తదితర భక్తులు పాల్గొన్నారు.

## ప్రేమ్ నగర్ లో మంచినీటి సమస్య

### నీరు సరఫరా చేసి బిల్లు అడగాలని మహిళల డిమాండ్

**అంబర్ పేట్, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** అంబర్ పేట్ డివిజన్ లోని ప్రేమ్ నగర్ బస్తీలో మంచినీటి సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్న జలమండలి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని బిజెపి నాయకుడు యశ్వంత్ ఆరోపించారు. శనివారం ఆయన ప్రేమ్ నగర్‌లో పర్యటించి మంచినీటి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా బస్తీలో మంచినీటి సరఫరా సరిగా జరగడం లేదని పేర్కొన్నారు. నల్లాలలో సరఫరా అయిన నాలుగు బిందెలు కూడా కలుషిత నీరు ఉండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ విషయమై స్థానిక ప్రజలు జలమండలి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని విమర్శించారు. నల్లాలలో నీటి సరఫరాను మెరుగు పరచని జలమండలి అధికారులు బిల్లులు కట్టాల్సిందేనని లేనిపక్షంలో మీ డ్రైనేజీ కనెక్షన్ కట్ చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రజలకు నాణ్యతమైన మంచినీటిని అందించి బిల్లు అడగాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాస్, శోభ,శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## లైసెన్స్ పొందిన వారి నుండే బాణసంచా కొనాలి

### డిఎఫ్ ఓ నాగేశ్వరరావు

**సంగారెడ్డి, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** దీపావళి పండుగ అందరి జీవితాల్లో వెలుగు తెచ్చే పండుగ అందువల్ల ప్రజలు బాణసంచాలు కాల్చే తప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా డి ఎఫ్ ఓ నాగేశ్వరరావు తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ లైసెన్స్ పొందిన వాణిజ్య దారుల నుంచే టపాసులు వినియోగ దారులు కొనుగోలు చేయాలన్నారు. జిల్లాలో 330 బాణసంచా వాణిజ్య దారులు దర్కస్తులు చేసుకొన్నారని ఇందులో 10 దుకాణాలకు లైసెన్స్ మంజూరు ఇవ్వలేదని అన్నారు. సంగారెడ్డి 37, అందోల్ 8 సదాశివపేట 12 నారాయణ ఖేడ్ 22 జహీరాబాద్ లో 23 పటాన్ చెరులో 229 కి లైసెన్స్ జారీ చేయడం జరిగిందని తెలిపారు. 41 బాణసంచా దుకాణాలను తకిఖి చేయడం జరిగిందని పేర్కొన్నారు. జనవాసలు లేని ప్రాంతలు పా ర్కులు లేదా మైదానాలు, ఇరుకు భవనాల మధ్య బాణసంచాలు పేల్చి ప్రమాదాలకు లోనూ కావొద్దని పేర్కొన్నారు.

బాగ్ అంబర్ పేట్ డివిజన్ లోని మల్లికార్జున్ నగర్ లో రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్ పద్మ. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు బి.వెంకట రెడ్డి జిహెచ్ఎంసి వర్క్ ఇన్స్పెక్టర్ రవి నాయక్ మిరియాల శ్రీనివాస్ వెంకటరమణ రాజు, జ్యోతి నరహరి, తదితరులు పాల్గొన్నారు.

*-అంబర్ పేట్, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):*

## అలరించిన కళాకారుల నృత్య ప్రదర్శన

**ఉప్పల్, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** ఉప్పల్ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం సిద్ధ నాట్య కళా సమితి వారు "నాదం" ఊతుకాడు వెంకట కవి రచించిన సంకీర్తనలకి కళాకారులూ నర్తించారు. ప్రాణవాకారం, జటాధరా, కళింగ నర్తన, సకళలోక, మాధవ హృదయ, కళ్యాణ రామ మొదలైన అంశాలను గురు సుధామాల, గురు వాణి రమణ, గురు రేణుక ప్రభాకర్,గురు శ్రీలత, గురు భరణి, గురు నళిని, గురు చంద్రశేఖర్ శిష్య బృందం. ఈ కార్యక్రమానికి వసుంధర, డిప్యూటీ డైరెక్టర్, కళాశ్రీ డాక్టర్.పి.రమాదేవి, ప్రముఖ గాత్ర విద్వాన్సులు డాక్టర్ రమాప్రభ, రంజిత్ ఆకుల తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేసి కళాకారులను అభినందించారు.

## కేంద్ర విద్యా శాఖ కన్సల్టేటివ్ కమిటీ సభ్యురాలిగా శబరి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** కేంద్ర ప్రభుత్వ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ లో కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ కన్సల్టేట్టివ్ కమిటీలో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి చోటు కల్పించారు. ఈ కమిటీలో చైర్మన్ గా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి, ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రి డాక్టర్.ఎ.ఎస్.సుకాంత మజుందార్‌లతో పాటు సభ్యులుగా లోక్ సభ నుంచి టి.ఎం.సెల్వగణపతి. అగా సయ్యద్ రుహుల్లా మెహదీ, నంద్యాల, ఎంపీ.డా.బైరెడ్డి శబరి శోభనాబెన్ మహేంద్రసింగ్, బరయ్య అనిల్, యశ్వంత్ దేశాయ్, రఘురామ్ రెడ్డి, డా.ప్రభ మల్లికార్జున్ డా.ఫగ్గన్ సింగ్ కులస్తే. రాజ్య సభ నుంచి రామ్‌జీ లాల్ సుమన్, బికాష్ రంజన్ భట్టాచార్య డా.ఎం.తంబిదురై డా.సుధాంశు త్రివేది, డా.భీమ్ సింగ్, సత్నామ్ సింగ్ సంధు, ఎక్స్-అఫీషియో సభ్యులుగా, ఉపేంద్ర కుష్వాహ, అర్జున్ రామ్ మేఘవాల్, న్యాయం, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి డాక్టర్ మురుగన్, అన్ని రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులు, తదితరులకు కమిటీలో స్థానం కల్పించారు.

## నేటి ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవం

**ప్రొద్దుటూరు, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** నేటి ఆర్ఎస్ఎస్ పథ సంచలన్ ను విజయవంతం చేయాలని ఆర్ఎస్ఎస్ నగర కార్యవాహ బాల సుబ్బరాయుడు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రారంభమై 100 సంవత్సరములు అవుతున్న సందర్భంగా నేడు పట్టణంలోని గీతాశ్రమం నందు ప్రొద్దుటూరు పట్టణ, గ్రామీణ ఖండ పథ సంచలన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో స్వయం సేవకుల సమ్మేళనం, గణవేష్ పరిశీలన సంచలన్ అభ్యాసం సూచనలు, సంపత, గీతాశ్రమం నుండి గాంధీ రోడ్డు, విజయకుమార్ సర్కిల్, రాజీవ్ సర్కిల్, శివాలయం సర్కిల్, మైదుకూరు రోడ్డు రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నుండి శ్రీరాములపేట మీదుగా గీతాశ్రమం వరకు సంచలన్, పానీయ విరామం సభ వుంటుందని వివరించారు. కార్యక్రమంలో అతిథిగా యర్రగుంట్ల గవర్నమెంట్ కాలేజ్ ప్రిన్సిపాల్ త్రివిక్రమ్ రెడ్డి, వక్త గా విశ్వ హిందూ పరిషత్ విజయవాడ ప్రాంత సంఘటన మంత్రి శ్రీనివాస్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు. కావున ఆర్ఎస్ఎస్, అనుబంధ సంస్థల నాయకులు పాల్గొనాలని కోరారు.

## బలరాం రెడ్డికి డిసిసి నివాళులు

**నిజాంపేట్, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ మండల కేంద్రంలోని జంభికుంట గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు పట్లోల బలరాం రెడ్డి అనారోగ్యంతో మరణించారు. శనివారం వారి భౌతిక దేహాన్ని డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోల చంద్రశేఖర్ రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యాన్ని ఇచ్చి అన్ని విధాలుగా అండగా ఉంటామని చెప్పారు. వారితో కాంగ్రెస్ పార్టీ మండలం నేత నాయకులు రఘుపతి రెడ్డి మాజీ సర్పంచ్. నర్సింహా రెడ్డి. రాధాకిషన్ గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పదిపుట్లబైలు పంచాయతీలో టిడిపి సభ్యత్వ నమోదు

- వంద రూపాయల సభ్యత్వంతో ఐదు లక్షల రూపాయలు భీమా
- టిడిపి మహిళా నేత పులివర్తి సుధా రెడ్డి

**చంద్రగిరి, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** పాకాల మండలం పదిపుట్లబైలు పంచాయతీ కొండకిందపల్లిలో టిడిపి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం టిడిపి మహిళా నేత పులివర్తి సుధా రెడ్డి చేతుల మీదుగా స్థానిక నాయకుల సమక్షంలో శనివారం ప్రారంభించారు.ముందుగా లక్ష రూపాయలు కట్టి శాశ్వత సభ్యత్వంగా పులివర్తి సుధా రెడ్డి నమోదు చేసుకున్నారు.ఈ సందర్భంగా టిడిపి మహిళా నేత పులివర్తి సుధారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సూచనలతో టిడిపి సభ్యత్వ నమోదును రికార్డు స్థాయిలో చేపట్టేలా తెలుగుదేశం పార్టీ శ్రేణులు,శక్తి వంచన లేకుండా కృషి

చేస్తున్నారని పేర్కొన్నారు. వంద రూపాయల సభ్యత్వంతో తెదేపా కార్యకర్తలకు ఐదు లక్షల రూపాయల వరకు ప్రమాద బీమా,వారి కుటుంబ సభ్యులకు విద్య,వైద్యం, ఉపాధి కోసం సాయం అందించనున్నట్లు తెలిపారు. అర్హులైన వారికి జనవరి నుండి నూతన పెన్షన్లు మంజూరు చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జడ్పిటిసి నంగా పద్మజా రెడ్డి, మాజీ ఎంపీపీ చాముండేశ్వరిలు మాట్లాడుతూ లక్ష రూపాయలు కట్టిన వారికి టిడిపి పార్టీ నుంచి శాశ్వత సభ్యత్వం కల్పిస్తున్నారని,వంద రూపాయలకు కట్టిన వారికి ఐదు లక్షల వరకు ప్రమాద బీమా వర్తింప చేస్తుందని అన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకున్నవారికి ప్రమాద బీమా రెండు లక్షల రూపాయల నుంచి ఐదు లక్షల రూపాయల వరకు సీఎం నారా చంద్రబాబు నాయుడు పెంచారని గుర్తు చేశారు. చనిపోయిన కార్యకర్త అంత్యక్రియలకు పది వేలు ఇవ్వాలని పార్టీ నిర్ణయించిందన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు నాగరాజ నాయుడు,కార్యదర్శి పల్లున కుమార్,మాజీ మండలాధ్యక్షుడు మందలపు వెంకటేష్ బాబు, టీడీపి చంద్రగిరి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సావిత్రి, బొల్లినేని మహేష్ కుమార్,కుమార్ స్వామి నాయుడు,చలపతి నాయుడు, ఈశ్వర్ నాయుడు, చిన్నబ్బ నాయుడు,పాకాల పట్టణ అధ్యక్షుడు డి.మోహన్, లింగయ్య నాయుడు,రావెళ్ల మోహన్,నరసింహ యాదవ్, సుబ్రహ్మణ్యం, దాము, భాస్కర్, రఘు,టిడిపి నేతలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూరగాయల పంటను పరిశీలించిన ఉద్యాన శాఖ

**చంద్రగిరి, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం పదిపుట్లబైలు పంచాయతీలో వంకాయ, బీర, కాకర తోటలను ఉద్యాన అధికారిణి ఎస్.శైలజ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యాన అధికారిణి ఎస్.శైలజ మాట్లాడుతూ వంకాయ తోటల పెరుగుదల, పూత మరియు కాయ దశలో కాయ,కాండం తొలుచు పురుగు ఎక్కువగా ఆశించి నష్టపరుస్తుంది.నివారణకు రైతులు ఎమామెక్టిన్ బెంజోయేట్ ఐదు శాతం ఎస్ జి -0.5గ్రా.లేదా ఫోసలోన్35 శాతం ఈసి -1.5మి.లీ. లేదా క్వినాల్ ఫాస్ 25శాతం ఈసి-2.5మి.లీ, తెగులు మందు మాంకోజెబ్-2.5 గ్రా.కార్బెండజిం-1 గ్రా.లేదా సాఫ్-2.5 గ్రా.ంఅజాడిరక్టిన్10000 పిపియం-1మి.లీంజిగురు0.5 మి.లీ.ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయడం వలన వంకాయను ఆశించే పురుగు మరియు తెగుళ్లను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. కాకర,బీర,సొర వంటి తీగ జాతి కూరగాయలలో తీగ పెరుగుదల దశలో పాము చార తెగులు ఎక్కువగా ఆశిస్తుంది.దీని నివారణకు రైతులు క్లోరంట్రనిలిప్రోల్ 8.8 శాతం ంథయోమెథాక్సాంఎస్ సి-1 మి.లీ.లేదా ప్రొఫెనోఫోస్ 2మి.లీం అజాడిరక్టిన 1500 పిపియం 3మి.లీ.ంమాంకోజెబ్ 2.5 గ్రా.ంజిగురు 0.5 మి.లీ.ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.బాక్ట్రోసెరా కుకుర్బిటే రకపు పండు ఈగ తీగజాతి కూరగాయలను కాయపైన కుట్టడం వలన కాయ పశు

పురంగుకు మారి రాలి పోవడం జరుగుతుంది. నివారణకు రైతులు మెలన్ పండు ఈగ ఎర బుట్టలను ఎకరాకు ఐదు పెట్టుకోవాలని ఎరలోని లూర్ ను నెలకు ఒకసారి తప్పని సరిగా మార్చుకోవాలని సూచించారు.ఈ విధంగా చేయడం వలన తీగ జాతి కూరగాయలను ఆశించే పండు ఈగను అరికట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకురాలు వనజ,గ్రామ రైతులు పాల్గొన్నారు.

# టిడిపి సభ్యత్వంతో ఐదు లక్షల బీమా

- ప్రమాద భీమాతో పాటు 10 లక్షలు చంద్రన్న భీమా సౌకర్యం
- సభ్యత్వ నమోదు ను ప్రారంభించిన మంత్రి అచ్చన్నాయుడు

**శ్రీకాకుళం, అక్టోబరు 26 (నిఘా న్యూస్):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ అధ్యక్షులు నారా లోకేష్ టిడిపి పార్టీ బలోపేతానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నేడు ప్రారంభమైంది. టెక్కలిలో ఏడు ఆర్టీసీ బస్సులు ప్రారంభించిన వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చన్నాయుడు అనంతరం పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వం తీసుకున్న ప్రతీ కార్యకర్తకు రూ.5 లక్షలు ప్రమాద భీమాతో పాటు రూ.10 లక్షలు చంద్రన్న భీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. పసుపు కార్డు కలిగి ఉంటే భీమాతో పాటు గౌరవం,ఆ కుటుంబానికి భరోసా దక్కుతుందని అన్నారు.గతంలో పార్టీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు రూ.135 కోట్లు ఇన్సూరెన్స్ ద్వారా ఆర్థిక సహాయం అందించడం జరిగిందని అన్నారు. కార్యకర్తలు, నాయకులు సభ్యత్వం తీసుకోవడానికి ఉత్సాహంగా ఉరకలు వేస్తున్నారని తెలిపారు.

సభ్యత్వం తీసుకున్న కార్యకర్తల కుటుంబానికి ఇన్సూరెన్స్ తోపాటు, మట్టి ఖర్చులకు, పిల్లలు ప్రైవేటు పాఠశాలల్లో చదివితే ఫీజులో కన్సెక్షన్, వైద్య సేవల్లో రాయితీలు వంటి ప్రోత్సాహకాలు ఉండేలా చర్యలు తీసుకోబోతున్నామని వివరించారు. మండల పార్టీ అధ్యక్షుడు గ్రామాల్లో ఉన్న పార్టీ కార్యకర్తలు,నాయకులకు ముందుగా సమాచారం అందించి నిర్దిష్టంగా కార్యాచరణ ప్రణాళిక చేపట్టి రెండు నెలలు జరిగే సభ్యత్వ నమోదు కార్యక్రమం జయప్రదం చేయాలని ఆయన కోరారు.ప్రమాదాల్లో, కక్ష పూరిత దాడుల్లో మరణించిన కార్యకర్తల పిల్లలు చదువులకు ప్రత్యేకంగా స్కూల్ ఏర్పాటు చేసి చదివిస్తున్న పార్టీ టిడిపి అని తెలిపారు.

# చిరు వ్యాపారుల పొట్ట కొట్టొద్దని విజ్ఞప్తి

## జీవనోపాధి కోసం ఏర్పాటు చేసుకున్న షాపులను తొలగించొద్దని వేడుకోలు

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ రాజీవ్ గృహకల్ప సముదాయానికి సంబంధించిన చిరు వ్యాపారులు తమ జీవనోపాధి కోసం ఏర్పాటు చేసుకున్న చిన్న చిన్న వ్యాపార షాపులను జీహెచ్ఎంసీ వారు తొలగించకుండా కాపాడాలని శనివారం కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇంచార్జ్ కొలాన్ హన్మంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా రాజీవ్ గృహకల్ప సముదాయానికి సంబంధించిన ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ కుటుంబాల నిరుపేదలు రాజీవ్ గృహకల్ప స్థలం సర్వేనెంబర్ 348/1 లో వార్డ్ కార్యాలయం పక్కన, మసీదుకు ఎదురుగా గల రోడ్డు ప్రక్కన వారి జీవనోపాధి కోసం చిన్న చిన్న షాపులు ఏర్పాటు చేసుకొని చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామన్నారు. కాని ప్రస్తుతం తమ పొట్టకొట్టే విధంగా జిహెచ్ఎంసి అధికారులు తమ షాపులను తొలగించి ప్రహరీ గోడ నిర్మించే ప్రయత్నం చేస్తున్నారన్నారని వాపోయారు. కాబట్టి అట్టి పనులను వెంటనే నిలిపివేసి చిరు వ్యాపారస్తులు యెధావిధిగా వ్యాపారాలు చేసుకొని తమ జీవనాన్ని కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని, అట్టి స్థలాలను తమకే చెందే విధంగా కేటాయించి న్యాయం చేయాలని వినతి పత్రంలో

కోరినట్లు తెలిపారు. అందుకు కొలాన్ హన్మంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి అధికారులతో చర్చించి తప్పకుండా చిరు వ్యాపారులకు న్యాయం జరిగేవిదంగా చూస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిరువ్యాపారులు శ్రీనివాస్ రెడ్డి, భాన్సువాడ వెంకటేష్, నర్సింహ నాగభూషణం మహేష్, పుష్పలత విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# దశల వారిగా అభివృద్ధి పనులు

## కౌన్సిలర్ పసుల రాజేందర్ ముదిరాజ్

**అబ్దుల్లాపూర్ మెట్, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** దశల వారీగా కాలనీలలో అభివృద్ధి పనులు చేపట్టి వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నామని కౌన్సిలర్ పసుల రాజేందర్ ముదిరాజ్ అన్నారు. శనివారం పెద్దఅంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధి 6వ వార్డులో స్థానిక కౌన్సిలర్ పసుల రాజేందర్ ఆధ్వర్యంలో రూ.30 లక్షలతో చేపట్టిన సిసి రోడ్డు పనులను చైర్ పర్సన్ పండుగల జయశ్రీ ముఖ్య అతిథిగా హాజరై వైస్ చైర్ పర్సన్ చామ సంపూర్ణ విజయ శేఖర్ రెడ్డితో కలిసి కొబ్బరికాయ కొట్టి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశల వారీగా వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టి మున్సిపాలిటీ అభివృద్ధికి

అన్నివిధాలుగా కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.రవీందర్ రెడ్డి, కౌన్సిలర్ దండెం కృష్ణారెడ్డి నాయకులు కాలని వాసులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల జిల్లా విద్యా శాఖ అధికారిగా శనివారం బాధ్యతలు చేపట్టిన జనార్ధన్ రెడ్డి నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని కలిసిశారు. ఎంపీ శబరి, డీఈవో జనార్ధన్ రెడ్డి లు నంద్యాల జిల్లా విద్యాభివృద్ధిపై కొద్దిసేపు సమాలోచన చేసి జిల్లాలో అక్షరాస్యత శాతం పెరిగేలా చేద్దామన్నారు. అనంతరం ఉపాధ్యాయ సంఘాల నాయకులు వారి డిమాండ్లను వినతి రూపంలో ఎంపీ శబరికి అందించారు.

*-నంద్యాల, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):*

## ఆత్మీయతకు ప్రతిరూపాలు వీరశైవులు

### వీరశైవ లింగాయత్ సమాజం ప్రగతి వేదిక జిల్లా అధ్యక్షుడు మధు శేఖర్

**సంగారెడ్డి, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** వీరాశైవ లింగాయత్ సమాజం అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తున్నామని ఆ సమాజం జిల్లా అధ్యక్షుడు మధు శేఖర్ అన్నారు. శనివారం పోతిరెడ్డి పల్లిలో జిల్లా వీర శైవ లింగాయత్ సమాజం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు తప్పుడు ప్రచారం చేపట్టి సమాజం ఎదుగుదలను అడ్డుకుంటున్నారని తెలిపారు. రెండు వర్గాలుగా విడగొట్టితే ఎవరికి వచ్చేది ఏమి లేదని అన్నారు. వీరా శైవ లింగాగయత్ సమాజం అభివృద్ధి మొదటి సరి మహిళా కమిటీ ఏర్పాటు చేసి 20 వేల సభ్యత్వం చేసినన్నని తెలిపారు. నేడు జహీరాబాద్ లో మరో వీర శైవ లింగాయత్ సమాజం, సమావేశం పెట్టి వీరశైవులను విడదీసే ప్రయత్నం చేస్తున్నారని వారిని ఎవరు నమ్మడం లేదని తెలిపారు. వచ్చే కార్తీక మాసం వన భోజన కార్యక్రమలు నిర్వహిస్తామని తెలిపారు.త్వరలోనే నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరా శైవ సమాజం జిల్లా నాయకులు సభ్యులు తది తరులు పాల్గొన్నారు.

## అశ్వరావుపేటలో పోలీసుల రక్తదానం

**అశ్వారావుపేట, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** పోలీస్ అమర వీరుల వారోత్సవాలలో భాగంగా అశ్వారావుపేట పోలీస్ శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ తాటిపాముల కరుణాకర్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ నందు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి రక్తదానం చేసి శిబిరాన్ని ప్రారంభించగా పోలీసు సిబ్బంది ప్రజలు ఎంతో చురుకుగా పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన పోలీసు సిబ్బందిని, ప్రజలను సిఐ కరుణాకర్, ఎస్సై యాయాతి రాజు, దమ్మపేట ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి ఫ్రూట్ జ్యూస్ బిస్కెట్లను అందించి అభినందించారు. ఈ సందర్భంగా సిఐ తాటిపాముల కరుణాకర్ మాట్లాడుతూ అమర వీరుల స్ఫూర్తితో ముందుకు సాగుతూ, సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశంతో ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. రక్తదానం చేయడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చు, ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి రక్తదానంలో పాల్గొనాలి.

## ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం

**వలిగొండ, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ నూతన అధ్యక్షునిగా బెలిదే నాగేశ్వర్ ఉపాధ్యక్షులుగా గోరంటి రమేష్ ప్రధాన కార్యదర్శిగా ఆపీశెట్టి సంతోష్ కోశాధికారిగా గజ్జెల అమరేందర్ పట్టణ కమిటీ అధ్యక్షునిగా దోగిపర్తి సంతోష్ కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘమునకు బలోపేతం చేయడానికి ఆర్థికంగా రాజకీయంగా తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. ఎన్నిక ల పరిశీలకులుగా బెజిగం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బచ్చు శ్రీనివాస్, బెలిదె శ్రీనివాస్, పోకల రమేష్, చీకటిమల్ల వెంకటేశ్వర్లు, గౌరుశెట్టి అశోక్, పొద్దుటూరు లక్ష్మీ నరసయ్య, బెలిదే లక్ష్మీ నరసయ్య, కోడితల నాగరాజు, పంతంగి కిష్టయ్య, గుండె నరసయ్య, పాల్గొన్నారు.

# టిడిపి సభ్యత్వానికి విశేష స్పందన

- నందికొట్కూరులో టీడీపీ సభ్యత్వం కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి
- నంద్యాల ఎంపీ.డాక్టర్.బైరెడ్డి శబరి

**నందికొట్కూరు, నవంబర్ 26 (నిఘా న్యూస్):** తెలుగుదేశం పార్టీకీ పునాది కార్యకర్తలు అని, ప్రతి కార్యకర్త టీడీపీ సభ్యత్వం తీసుకోవాలని, నంద్యాల పార్లమెంట్ లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో అధిక సంఖ్యలో సభ్యత్వం నమోదు చేయించి రికార్డ్ సృష్టిద్దామని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి పిలుపు నిచ్చారు. శనివారం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి నాయకత్వంలో నంద్యాల పార్లమెంట్ పరిధిలోని నందికొట్కూరు అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ కార్యకర్తల సభ్యత్వ కోసం నందికొట్కూరు పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఇంటిలో, నంద్యాల నియోజకవర్గం కార్యకర్తల సభ్యత్వం కోసం నంద్యాల పట్టణంలోని రాజారెడ్డి ఫంక్షన్ హాల్ లో, పాణ్యం నియోజకవర్గం కార్యకర్తల కోసం కల్లూరు మండలం రూరల్, అర్బన్ కార్యకర్తల కోసం కర్నూలు నగరంలోని కర్నూలు కన్వెక్షన్ సెంటర్ (బైరెడ్డి ఫంక్షన్ హాల్) లో టీడీపీ సభ్యత్వ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసి కంప్యూటర్, ల్యాప్ టాప్, సెల్ ఫోన్ ల ద్వారా తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదుకు ఎంపీ బైరెడ్డి శబరి కి కేటాయించిన రెఫరల్ కోడ్ 18504582 కు సభ్యత్వం చేయించేందుకు పోటీపడ్డారు. ఎంపీ శబరి ఏర్పాటు చేసిన టీడీపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ విజనరీ నేత ముఖ్యమంత్రి చంద్రబాబు సారధ్యంలో టీడీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంను సమానంగా రాష్ట్రంలో ముందుకు తీసుకెళ్లుతున్నారని, ఇది టీడీపీ నాయకులు, కార్యకర్తల సంఘటితంతోనే సాధ్యమౌతోందని అన్నారు. టీడీపీ సభ్యత్వ రుసుము ఎప్పటిలాగే రూ. 100 లు, ఏదైనా అనివార్య కారణాల వల్ల టీడీపీ సభ్యుడు మరణిస్తే మట్టి ఖర్చుల క్రింద పార్టీ వెంటనే రూ. 10 వేలు, రూ. 5 లక్షల ఇన్సూరెన్స్ ఉంటుందని, పాత వారు సభ్యత్వం రెన్యూవల్ చేసుకోవాలని, కొత్త వారు టీడీపీ సభ్యత్వం నమోదు చేసుకోవాలని, ఈ సభ్యత్వం 2024-2026 వరకు ఉంటుందని ఎంపీ బైరెడ్డి శబరి వివరించారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి, మాజీ జడ్ పి టీ సి నాగేశ్వరావు, బి ఎస్ ఎన్ ఎల్ సలహా కమిటీ సభ్యులు కురువ రమేష్, శ్రీనివాసనాయుడు, వెంకటేశ్వర్లు, నంద్యాల టీడీపీ నాయకులు నరహరి విశ్వనాథ్ రెడ్డి, అజయ్, కోడూరు సంజీవరెడ్డి, బొమ్మిరెడ్డి, గణపం పుల్లారెడ్డి, పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ సీనియర్ నాయకులు బైరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, మల్లెల పుల్లారెడ్డి, కల్లూరు శివారెడ్డి, ఈశ్వరయ్య, తదితరులు సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు.

నల్లకుంట డివిజన్ లోని భాయమ్మ గల్లీ మేధా స్కూల్ వద్ద జరిగిన బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న డివిజన్ కార్పొరేటర్ వై.అమృత. ఈ కార్యక్రమంలో అంబర్ పేట కన్వీనర్ శ్యామ్ రాజ్, డివిజన్ కన్వీనర్ కేబి.నర్సింగ్ రావుతదితరులు పాల్గొన్నారు.

-నల్లకుంట, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):

## ఉస్మానియా యూనివర్సిటీకి.. తొలి దళిత వైస్ ఛాన్స్ లర్

### వైస్ ఛాన్సలర్ కు శుభాకాంక్షలు తెలిపిన శేఖర్

**భువనగిరి, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా నూతనంగా ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గా నియమితులైన ప్రొఫెసర్ కుమార్ ని తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ కాలేజ్ లెక్చరర్ సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కట్ట శేఖర్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100 సంవత్సరాల చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీకి విద్యారంగంలో పరిపాలన అనుభవంలో అన్ని అర్హతలు ఉన్నా తొలి దళిత ప్రొఫెసర్ వైస్ ఛాన్సలర్ గా నియమితులు కావడం సంతోషించ దగ్గ విషయం అన్నారు. అదేవిధంగా ఉస్మానియా యూనివర్సిటీని అన్ని రంగాలలో ప్రజాస్వామ్య బద్ధంగా ముందుకు తీసుకెళ్లాలని విద్యార్థులకు, ఉద్యోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పట్ల సానుకూలంగా వ్యవహరించి పరిష్కరించి సుపరిపాలన పాలన అందించి యూనివర్సిటీ అభివృద్ధిలో అన్ని వర్గాలను కలుపుకొని ముందుకెళ్లాలని తెలిపారు.

## డీఏపీసీ టీఎస్ ఐ పాస్, టీ ప్రైడ్ పై సమీక్ష

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనుమతుల విషయంలో జాప్యం లేకుండా సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పరిశ్రమల, ఆయా శాఖల ఉన్నతాధికారులతో శనివారం డీఏపీసీ-టీఎస్ ఐ పాస్, టీ ప్రైడ్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఇప్పటిదాకా ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, అనుమతి కోసం ఎన్ని పెండింగ్ లో ఉన్నాయి. ఏ ఏ కారణాలతో నిలిచిపోయాయో ఆయా శాఖల ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. డీఏపీసీ-టీఎస్ ఐ పాస్ కింద పీసీబీ-2, సెస్, ఫ్యాక్టరీస్, నీటి పారుదల శాఖ వద్ద ఒక్కో అప్లికేషన్ పెండింగ్ లో ఉన్నట్లు కలెక్టర్ దృష్టికి జీఎం ఇండస్ట్రీస్ గణేష్ రాం తీసుకెళ్లారు. టీ ప్రైడ్ కింద ఎస్సీ లకు 21, ఎస్టీలకు 19, దివ్యాంగులకు ఒకటి, పావలా వడ్డీ కింద 2 యూనిట్స్ మంజూరయ్యాయని జీఎం ఇండస్ట్రీస్ గణేష్ రాం తెలిపారు. ఈ సమావేశంలో ఇండస్ట్రీస్ ఏడీ భారతి, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, ఎల్డీఎం మల్లికార్జున్, జిల్లా ఇరిగేషన్ అధికారి అమరేందర్ రెడ్డి, సెస్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, డీటీసీపీఓ అన్సార్, లేబర్ ఆఫీసర్ నజీర్ అహ్మద్, డీటీడీఓ జనార్ధన్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బృందావన వనంగా పోలీస్ స్టేషన్

### కురవి ఎస్ఐ గండ్రాతి సతీష్ కు అభినందనలు

**కురవి, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** విధి నిర్వహణను కర్తవ్యం గా నిర్వహిస్తూ పోలీస్ స్టేషను బృందావన వనంగా తీర్చిదిద్దిన కురవి ఎస్సై గండ్రాతి సతీష్ రూటే సపరేటు. అయినా ఏ పోలిస్ స్టేషన్ లో బాధ్యతలు తీసుకున్న ఆ పోలీస్ స్టేషన్ రూపురేఖలే మారుస్తాడు. పోలిస్ స్టేషన్ వచ్చే బాదితులు కాసేపు సేద తీరాలని ఆహారకరమైన వాతావరణం ఏర్పాటు చేసి పిర్యాదు దారులకు కాసేపు సేద తీరే విధంగా పచ్చని చెట్లు మధ్య విశ్రాంతికి ఏర్పాట్లు చేశారు. ప్రమాదంలో ఇతర కారణాలతో దొరికిన బైకులు ఆటోలు ఇతర వెహికిల్లు భద్రపరచడం కోసం ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేశారు. పోలిస్ స్టేషన్ పరిసరాల ప్రాంతంలో పక్షులకు ఆహార కుండీలను ఏర్పాటు చేసి మానవత్వం చాటుకున్నారు. గతంలో నర్సింహులపేట ఎస్ఐ గా చేసే సమయంలో ఒక నిరుపేద ఆంధ్రుల కుటుంబాన్ని చేరదీసి వారికి తన సొంత డబ్బులతో ఇల్లు నిర్మించి వారి కుటుంబాన్ని అక్కున చేర్చుకున్నాడు. కురవి పోలిస్ స్టేషన్ బాధ్యతలు తీసుకున్న తక్కువ సమయంలో అక్కడ ప్రజల తనదేన మార్కు చాటుకొని అందరి అభినందనలు ఎస్ఐ సతీష్ పొందుతున్నారు.

## అన్నదానం చేయడం అదృష్టంగా భావిస్తాను

### కృష్ణాలయ కమిటీ చైర్మన్ చల్లా రాజగోపాల్ యాదవ్

**ప్రొద్దుటూరు, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** అన్నదానం తన అదృష్టంగా భావిస్తానని టిడిపి బీసీ నాయకులు ప్రొద్దుటూరు కృష్ణలయ కమిటీ చైర్మన్ చల్లా రాజగోపాల్ యాదవ్ తెలిపారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని అన్వర్ హాల్ వద్ద శనివారం ఆయన ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించగా, దాదాపు 1000 మంది స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనకు దేవుడు ఇచ్చిన దానిలో పేదలకు సహాయం చేయాలని తాను గత మూడు సంవత్సరాలుగా అన్నదానం నిర్వహిస్తున్నానని తెలిపారు. సాధారణంగా ప్రతి శనివారం పట్టణంలోని మైదుకూరు రోడ్డులోని అన్వర్ థియేటర్ వద్ద అలాగే కొర్రపాడు రోడ్డులోని పాత బస్టాండ్ వద్ద అన్నదాన సాధారణంగా ప్రతి శనివారం పట్టణంలోని మైదుకూరు రోడ్డులోని అన్వర్ థియేటర్ వద్ద అలాగే కొర్రపాడు రోడ్డులోని పాత బస్టాండ్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రతి పౌర్ణమి రోజున శ్రీశ్రీశ్రీ చిన్నమ్మ, తల్లి పెద్దమ్మ తల్లి చెట్టు వద్ద భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. భక్తులు చుట్టుపక్కల వారు భోజనం సంతృప్తిగా భోంచేసారన్నారు. ఇలాగా అన్నదానం చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చిం దని ఆయన అన్నారు. ప్రతి శనివారం చేసే అన్నదానం కార్య క్రమం యథావిధిగా కొనసాగుతుందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో చల్లా రవిశంకర్ యాదవ్, నాయి బ్రాహ్మణ రాష్ట్ర ఉపాధ్యక్షులు బలపనూరు శ్రీనివాసులు, మూరబోయిన శ్రీనివాస్ యాదవ్, చింతల రాఘవేంద్ర యాదవ్, సీతంపల్లి రమణ, బంగి శివప్రసాద్, టైలర్ ప్రసాద్, సోమాపురం చక్రవర్తి, టైలర్ దస్తగిరి, ఏసునాథరెడ్డి, డ్రైవర్ భాష పాల్గొన్నారు.

## స్థానిక చరిత్రను... గోడలపై చిత్రీకరించాలని వినతి

**మైదుకూరు, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** మైదుకూరు నియోజకవర్గపు చరిత్రను మైదుకూరు పట్టణ రహదారి గోడలపై చిత్రీకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ రెడ్డికి రచయిత, చరిత్ర పరిశోధకులు బొమ్మిశెట్టి రమేష్, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం మాజీ సభ్యుడు డాక్టర్ తవ్వా వెంకటయ్య వినతి పత్రాన్ని కమిషనర్ కార్యాలయంలో శనివారం సమర్పించారు. ఈ సందర్భంగా రచయిత మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ కాలజ్ఞాని వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర, అల్లాడుపల్లె వీరభద్ర స్వామి, సిద్దయ్య గారి మఠం, లంకమల అభయారణ్య అత్యంత ప్రసిద్ధి చెందిన కలివికోడి, రాయలసీమ పాలెగాళ్ల వ్యవస్థలో ఏకైక మహిళా పాలెగత్తె వన్నూరమ్మ, శ్రీ నాగ మల్లేశ్వర స్వామి కొండల్లోని బుద్ధిని పాదాలు, నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీ మొండి భైరవ కొండయ్య స్వామి, సీఎల్ బావి, తెల్ల నీళ్ల కుంట, బ్రహ్మసాగర్, కేసి కాలువ, అంబతల్లి, యొద్దడుగు కనుమ, చింతకుంట చెరువు, జాండ్లవరం కోట, ముక్కొండ, దువ్వూరు చరిత్ర, వనిపెంట శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి గురించి విశేషాలతో కూడిన చిత్రపటాల రూపంలో చరిత్రను వర్ధమాన, భవిష్యత్తు తరాలకు సులభంగా తెలపటానికి అవకాశం ఉందని చెప్పారు. తవ్వా వెంకటయ్య ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా బస్సు ప్రాంగణంలో హోర్డింగ్స్ ఏర్పాటు చేసి దాని ద్వారా చరిత్రను తెలపవలసిన అవసరం ఉందని సూచించారు. దీంతో నియోజకవర్గ ప్రజలకు, విద్యార్థులకు చరిత్ర పట్ల, చరిత్రను కాపాడుకునే అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తవ్వా కోరారు. వినతి పత్రాన్ని స్వీకరించిన కమిషనర్ మాట్లాడుతూ దీనిని మున్సిపల్ సమావేశంలో చర్చించి స్థానిక కవులు, రచయితలతో కూడా సంప్రదించి సాధ్యమైనంత వరకు చరిత్రను భావితరాలకు తెలియజేసే ప్రయత్నం చేస్తామన్నారు.

## నిర్వాసితులకు అన్యాయం చేయొద్దు

### సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

**వేలేరుపాడు, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** మండలం లోని (సిపిఐ) ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముందు పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఇంటి విలువలు విషయంలో అవకతవకలు జరిగి నిర్వాసితులు నష్టపోతున్నారని,వెంటనే ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలన్నారు. మంజూరైన జాబితా నుండి జగన్నాధపురానికి గ్రామానికి చెందిన 140 మంది పేర్లను తొలగించడానికి కారణాలు వెంటనే తెలపాలని, డిమాండ్ చేశారు. ఒక్క గ్రామంలోనే ఇన్ని పేర్లు తొలగిస్తే మండల మొత్తం మీద ఎన్ని కుటుంబాలకు అన్యాయం జరుగుతుందోనన్నారు. నిర్వాసితుల జాబితాను వెంటనే బహిర్గతం చేసి వారికి అందిస్తున్న వివిధ ప్యాకేజీల గురించి తెలియజేయాలన్నారు. నిర్వాసితులు నష్టపోతున్న ప్రతి ఒక్క దానికి విలువ కట్టి ఆ విలువను నిర్వాసితులు అంగీకరించాకే ఈ ప్రాంతం నుంచి తరలించాలన్నారు. ఈ ప్రాంతంలోనే పుట్టి పెరిగి 60 సంవత్సరాలు దాటిన కుటుంబాల వారిని కూడా ఇంటి విలువలు జాబితా నుండి తొలగించారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వారికి న్యాయం చేయకపోతే రాబోయే రోజుల్లో మరిన్ని పోరాడాలి ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ డి వి సత్యనారాయణకి నిర్వాసితుల సమస్యలను తెలియజేస్తూ వాటిని పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి మునీర్, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, రామవరం సర్పంచ్ పిట్ట ప్రసాద్, ఏపీజిఎస్ జిల్లా కార్యదర్శి కారం దారయ్య, మండల కార్యదర్శి బాడిస రాము, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్ర మధు, పిట్ట వీరయ్య, కామయ్య, స్థానిక నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.

## మధిరలో కోర్టు భవనాలకు భూమి పూజ

- కోర్టు కాంప్లెక్స్ నిర్మాణ పనులను ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తి శ్రీసుధ

**మధిర, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** మధిరలో రూ.24 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రెండు కోర్టు కాంప్లెక్స్ లకు, రూ.39 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న రికార్డ్స్ భవన నిర్మాణ పనులకు శనివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి,ఖమ్మం జిల్లా పరిపాలనా న్యాయమూర్తి పి.శ్రీ సుధ, హైకోర్టు న్యాయమూర్తులు భీమపాక నగేష్,కాజా శరత్, ఖమ్మం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ న్యాయమూర్తి జి.రాజగోపాల్ లతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా భవన ప్లాన్ ను న్యాయమూర్తులు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ, కోర్టు భవన నిర్మాణ పనులు త్వర త్వరగా చేపట్టి అగ్రిమెంట్ తేదీలోగా పూర్తి చేయాలని న్యాయమూర్తులు అన్నారు. అలాగే రిక్రియేషన్ క్లబ్ కాంప్లెక్స్ లో ఏర్పాటు చేసిన సీనియర్ సివిల్ కోర్టును ను న్యాయమూర్తులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మధిర సీనియర్ సివిల్ న్యాయమూర్తి మీరా ఖాసీం సాహెబ్,జడ్జి కార్తీక్ రెడ్డి,మధిర బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.పుల్లారావు,ఆర్ అండ్ బి ఎస్ఇ హేమలత, మధిర మునిసిపల్ కమీషనర్ సంపత్ కుమార్, తహశి ల్దార్ రాంబాబు, న్యాయవాదులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్యుఐ నేతకు ఎమ్మెల్యే సాయం

**మోత్కూరు, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** మోత్కూర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్ ఇటీవల ఎర్నియా వ్యాధి రావడంతో తీవ్ర కడుపునొప్పితో ఇబ్బంది పడ్డాడు. శనివారం ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేసుకోన్న విషయం తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ తెలుసుకొని నిమ్మల శ్రీనును పరామర్శించి తక్షణ సహాయం కింద రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పైళ్ళ సోమిరెడ్డి,డా.లక్ష్మీ నర్సింహా రెడ్డి,పట్టణ అధ్యక్షులు గుండగోని రామచంద్రు,ఎండి సమీర్,నాయకులు జినుకల కనకయ్య,మెంట నగేష్,కొనతం నరేందర్ రెడ్డి,మెంట సురేష్, నాయకులు బీసు రాహుల్, శ్రీను,నర్సింహ రాజు తదితరులు పాల్గొన్నారు.

## టిపిఎస్ఏ పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక

**సిద్దిపేట, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** సిద్దిపేట జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం, నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో సిద్దిపేట జిల్లా అధ్యక్షుడుగా జి చంద్రశేఖర్ గౌడ్, ఎన్నిక కాగా, ప్రధాన కార్యదర్శిగా ఎల్ విజయ్ కుమార్, ట్రెజరీగా వి రాంరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడుగా ఎండి ఫహిం, వైస్ ప్రెసిడెంట్ లుగా బండి రాజు, డి.రాములు, ఎస్ శ్రీకాంత్, పి.రాజమణి, ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీగా పి గణేష్, బి.మహేష్, ఎం.శోభ, బి.అరుణశ్రీ, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా బి.నర్సింలు, యేటి బాబు,పబ్లిసిటీ సెక్రెటరీగా బి సతీష్, ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ గా ఏ రవి,సి హెచ్ హరిప్రసాద్, జె మాధవ్, జి చక్రపాణి, బి.రజిత, ఎన్నిక పరిశీలకులుగా ఎండి,మహమ్మద్ జహీరోద్దీన్ ఎంపీ ఓ,దేశరాజు శ్రీనివాస్ రావు,మాజీ అధ్యక్షుడు ఎం.విష్ణులు వివరించారు.

## రైతులను నిలువు దోపిడీ చేస్తున్న దళారులు

### ప్రభుత్వ అనుమతులు లేకుండా రైతుల నుండి బియ్యం సేకరిస్తున్న మాఫియా

**వలిగొండ, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** వలిగొండ మండలంలో ప్రభుత్వంతో ఎలాంటి అనుమతులు (లేసెన్స్) లేకుండా బహిరంగంగా ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ రైతులను నిలువ దోపిడీ చేస్తున్న దళారులపై వెంటనే జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేసారు. శనివారం వలిగొండలో జరిగిన సిపిఎం సమావేశంలో వారు మాట్లాడుతూ వలిగొండ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వం నుండి ఎలాంటి లైసెన్సులు లేకుండా రైతుల నుండి ధాన్యాన్ని తక్కువ ధరకు కొంటూ నిలువ దోపిడి చేస్తున్న వారందరిపై చర్యలు తీసుకోవడంలో మండల స్థాయి అధికారులు మార్కెట్ కమిటీ అధికారులు విఫలం చెందారని వెంటనే జిల్లా స్థాయి సివిల్ సప్లయ్ అధికారులు జాయింట్ కలెక్టర్ వీటిపై దృష్టి పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శివర్గ సభ్యులు చీర్క శ్రీశైలం రెడ్డి, మండల కమిటీ సభ్యులు కవిడే సురేష్, పట్టణ కార్యదర్శి గార్ధాసు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రతి ఒక్కరి బాధ్యత..

# రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచిన జిల్లా ఎస్పీ

**సిరిసిల్ల, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా( ఫ్లాగ్ డే) శనివారం సిరిసిల్ల పట్టణ పరిధిలోని పద్మనాయక ఫంక్షన్ హాల్ లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల,కరీంనగర్, మంచిర్యాల,వరంగల్ రెడ్ క్రాస్ సొసైటి వారి సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ. రక్తదాన శిబిరానికి విశేష స్పందన సుమారుగా 650 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది, యువత పాల్గొని రక్తదానం చేయగా,రక్తదానం చెసిన వారికి ప్రశంస పత్రలను అందించి అభినందించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆమరవీరులు సమాజం కోసం, దేశం కోసం, రేపటి తరాల మంచి భవిష్యత్తు కోసం ప్రాణత్యాగాలు చేశారని వారి త్యాగాలను వెలకట్టలేమన్నారు. అమరుల త్యాగ ఫలంగానే ఈరోజు ప్రజలందరూ ప్రశాంతంగా ఉన్నారన్నారు.రక్త దానం చేయడం అనేది ఒక సామాజిక సేవా కార్యక్రమం అని, క్లిష్ట పరిస్థితులల్లో, ఉన్నప్పుడూ ఆపదలో ఉన్న ప్రాణాలు రక్షించడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఇటువంటి సామాజిక సేవలలో పాల్గొని తోటి వారి ప్రాణాలను కాపాడటములో తమవంతుగా రక్త దానం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల సంస్కరణ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి పెద్ద సంఖ్యలో యువకులు ముందుకు వచ్చి ఉత్సాహంగా పాల్గొనడం అభినందించ దగ్గ విషయమని ,విధి నిర్వహణనే లక్ష్యంగా ప్రాణత్యాగం చేసి అమరులైన పోలీసులను ఈ సమాజం

ఎప్పటికీ మరువదని, వారి జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజల ధన మాన ప్రాణాలను కాపాడుతూ సంఘవిద్రోహ శక్తుల చేతుల్లో బలైన అమర పోలీసులు వీరులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. రెగ్యులర్ పోలీసింగ్ తో పాటు ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకునేందుకు, రాష్ట్రంలో ఉన్న ఎంతోమంది తలసేమియా, సికిల్ సెల్ అనీమియా, డెంగ్యూ వ్యాధి గ్రస్తులకు రక్తం చాలా అవసరం వారికి సహాయం కోసం అమర వీరుల స్మరకర్థం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో సుమారు 600 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది,జిల్లాలోని యువకులు పాల్గొని విజయవంతం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిఐలు, ఆర్.ఐ లు,ఎస్.ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్య విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం

**తిరుపతి, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** ఎస్వీ వైద్య కళాశాలలో వైద్య అధ్యాపకులు వైద్య విద్యార్థుల తల్లిదండ్రుల తొలి సమావేశం నిర్వహించారు, ఈ సమావేశాన్ని అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి ఏ చంద్రశేఖరన్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వైద్య అధ్యాపకులే కాకుండా,వైద్య విద్యార్థి తల్లిదండ్రులు కూడా వైద్య విద్యార్థుల పైన వారు చదువు గురించి,అటెండెన్స్ పైన కూడా కొంతమేరకు పర్యవేక్షణ తప్పక ఉండాలని, అప్పుడే వారు వైద్య విద్యలో ఏ విధంగా ముందుకు కొనసాగు తున్నారని తెలుసుకునడానికి ఇలాంటి సమావేశాలు ఎంతైనా అవసరమని తెలిపారు. నేషనల్ మెడికల్ కమిషన్ (న్యూఢిల్లీ) వారు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం సంవత్సరంలో రెండు సమావేశాలైన నిర్వహించాలని, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కు ఆదేశాలు జారీ చేశారు. ఆ సందర్భంగా వైద్య విద్యార్థి, ఎలా చదువుతున్నాడు ఎలా క్లినికల్ పోస్టింగ్ వెళు తున్నాడు, అని అంశముల మీద ముఖ్యంగా అటెండెన్స్ లు, పరీక్షల్లో వారు వస్తున్న మార్కుల పైన ప్రతి తల్లిదండ్రులు కొంతమేరకు పర్యవేక్షణ ఉండాలని, అప్పుడే ఉత్తమమైన వైద్య విద్యను అభ్యసించి సంఘంలో మెరుగైన వైద్యుడుగా పేదలకు మెరుగైన వైద్యం అందించగలరని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన తల్లిదండ్రులు ఇకమీదట వారి పిల్లల పైన ఒక పర్యవేక్షణ కచ్చితంగా ఉంచుతామని ఈ సమావేశంలో ప్రసంగించారు. ఇలాంటి సమావేశం తరచు నడపాలని ఈ సందర్భంగా తల్లిదండ్రులు ప్రిన్సిపాల్ ను కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, (పరిపాలన), బాలుర వసతి గృహం వార్డెన్ డాక్టర్ తులసిరామ్, బాలికల వసతి గృహం వార్డెన్ డాక్టర్ రాణి, డాక్టర్ ఫహీం, వివిధ విభాగాల అధిపతులు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, మొదటి సంవత్సరం నుంచి ఆఖరి సంవత్సరం వరకు ఉన్న వైద్య విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఎస్ వి వైద్య కళాశాల పి.ఆర్వో వీర కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు నిరసనను విజయవంతం చేయాలి

### బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్

**పెద్దపేరు, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణ మాఫీ చేయకుండా రైతులను అరిగోస పెడుతుందని, ఈనెల 29న జరిగే రైతు ప్రజా నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ అన్నారు. శనివారం సాయంత్రం పెద్దేరు ప్రెస్ క్లబ్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తీవ్ర ఆవేదనలో ఉన్నారని, బాధ్యతగల ప్రతిపక్షంగా రైతుల పక్షాన పోరాడాలని బీఆర్ఎస్‌కు పెద్దేరు బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపు నిచ్చారు. వనపర్తిలో ఈ నెల 29న వేలాది మంది రైతులతో భారీ నిరసన సదస్సు చేపడుతున్నామని, దీనికి హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. కావున కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వసం రాములు,పట్టణ పార్టీ అధ్యక్షుడు దిలీప్ కుమార్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి,ఎద్దుల సాయినాథ్,చిన్న ఎల్లారెడ్డి, మేకల ఎల్లయ్య శేఖర్ గౌడ్,విశ్వరూపం, మంగరాయి మన్యం, శేఖర్,సాయిరెడ్డి, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నేతకు మాజీ ఎమ్మెల్యే నివాళులు

**నిజాంపేట్, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ మండల కేంద్రానికి చెందిన బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సంగోనిసాయిగౌడ్ రోడ్డు ప్రమాదంలో మరణించారు. విషయం తెలుసుకున వారి అంత్యక్రియలు పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ శాసనసభ్యులు మహా రెడ్డి భూపాల్ రెడ్డి. వారితో పాటు తాజా మాజీ వైస్ ఎంపీపీ సాయి రెడ్డి కల్హేర్ తాజా మాజీ జడ్పిటిసి నరసింహారెడ్డి ఉప సర్పంచ్ రాంచేందర్ పటేల్ నాయకులు ప్రవీణ్ రెడ్డి కిష్టారెడ్డి భాస్కర్ గౌడ్ సత్యనారాయణ గౌడ్ లింగ గౌడ్‌వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## నూతన సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేయాలి

### యాదాద్రి జిల్లా డిడికి బీసీ నేతల వినతి పత్రం

**భువనగిరి, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** యాదాద్రి జిల్లా భువనగిరి కేంద్రంతో పాటు చుట్టూ ఉన్న మండలాలలో బీసీ సంక్షేమ హాస్టల్ లను ఏర్పాటు చేయాలని ఎస్సీ ఎస్టీ, బీసీ, ఈబీసీ మైనార్టీ అన్ని వర్గాల విద్యార్థులు హాస్టల్లో ఉండి చదువుకుంటారని బీసీ విద్యార్థి సంఘం నాయకులు వేముల అనిల్, బాలాజీ నాయక్, గుండెబోయిన శంకర్, ఆధ్వర్యంలో కలెక్టరేట్లో డిడి యాదయ్యకు వినతిపత్రం ఇచ్చారు. బీసీ విద్యార్థి సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లగొర్ల మోదీరాందేవ్ మాట్లాడుతూ బస్ సౌకర్యం లేక ఆర్థికంగా లేక విద్యకు దూరమవుతున్నందున నూతన సంక్షేమ హాస్టళ్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు విద్య అందించాలని ఆయన అన్నారు. జిల్లాలో ఇంటర్ డిగ్రీ ఇంజనీరింగ్ ఫార్మసీ పాలిటెక్నిక్ మెడిసిన్ తదితర కోర్సులు చదివే విద్యార్థులు పెరగడంతో ఇప్పుడున్న హాస్టల్లు సరిపోనందున మరికొన్ని నూతన హాస్టల్స్ ను మంజూరు చేయాలని అలాగే పాఠశాలలలో చదువుకునే విద్యార్థులకు హాస్టల్లు ఏర్పాటు చేయాలని కోరారు. రామన్నపేట, చౌటుప్పల్, ఆలేరు, మోత్కూర్, వలిగొండ, బొమ్మలరామారం, మండల కేంద్రాలలో నూతన హాస్టల్ మంజూరు చేయాలని కోరారు. అధికారులు సానుకూలంగా

స్పందించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి విద్యార్థుల కోసం మరికొన్ని హాస్టల్ లను మంజూరు చేస్తామన్నారు. ఈ సమావేశంలో వేముల అనిల్, భూక్య సంతోష్ నాయక్, గుండెబోయిన శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## సహ చట్టంపై అవగాహన పెరగాలి: ఏవో స్రవంతి

**తిరుపతి రూరల్, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** సమాచార హక్కు చట్టం (2005) పై ప్రతి ఒక్కరూ అవగాహను పెంపొందించు కోవాలని మండల వ్యవసాయ అధికారిణి స్రవంతి అన్నారు. శనివారం మండలంలోని గంగిరెడ్డిపల్లి గ్రామ రైతు సేవా కేంద్రం నందు సమాచార హక్కు చట్టం - 2005 పై రైతులకు, మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై పూర్తిగా అవగాహన కల్పించి, సెక్షన్ 4(1)(సి) ప్రకారం కార్యాలయం ఆవరణలో సమాచార హక్కు బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. సమాచార బోర్డులో పౌర సమాచార అధికారి, సహాయ పౌర సమాచార పేర్లు, హెూదా మొబైల్ నెంబర్లు స్పష్టంగా కనిపించే విదంగా ప్రదర్శించాలని తెలియచేసారు. సెక్షన్ 7 లో దరఖాస్తుదారుడు కోరిన సమాచారాన్ని కాల పరిమితి లోగా ఇవ్వాలని వివరించారు. సహాయ ప్రజా సమాచార అధికారి సమాచారం సకాలంలో లేవకపోతే సెక్షన్ 19 (1) ప్రకారం పై స్థాయి అధికారులు అప్పీల్ చేసుకోవచ్చు అన్నారు. సెక్షన్ 20(1)(2) ప్రకారం సమాచారం పూర్తిస్థాయిలో లేదా సంతృప్తి కలగని సమాచారం ఇవ్వని సందర్భాలలో సమాచార హక్కు కమిషన్ సమాచారాధికారిపై జరిమానా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. సమాచారం తెలుసు కోవడం ప్రజల హక్కు సమాచార హక్కు చట్టం ప్రకారం కోరిన సమాచారం అందుబాటులో లేకుంటే సంబంధిత శాఖల అధికారులకు సదరు దరఖాస్తు బదలాయించవచ్చు అన్నారు. రిజెక్ట్ చేసిన సందర్భాలలో దరఖాస్తుదారునికి లిఖితపూర్వకంగా కారణాలు తెలియజేయాలి. కావున కోరిన సమాచారాన్ని ఇవ్వాల్సిన భాధ్యత సంబంధించిన సమాచార అధికారిపై ఉందన్నారు. ప్రజలు ఈ సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకుని అవసరమైన సమాచారాన్ని ప్రభుత్వ అధికారులు సంస్థల నుండి పొందగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సేవ కేంద్రాల వ్యసాయ, ఉద్యాన సహాయకులు మరియు ప్రకృతి వ్యసాయ సిబ్బంది. రైతులు పాల్గొన్నారు.

## బాలికలలో పెరుగుతున్న రక్తహీనత

- తగ్గించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలి
- డాక్టర్ యలమంచిలి నాగమణి
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఖమ్మం ప్రభుత్వ బాలికల కళాశాలలో సెమినార్

**ఖమ్మం, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** సమాజంలో రోజు రోజుకీ విద్యార్థినిలలో పెరిగిపోతున్న రక్తహీనత సమస్యను తగ్గించేందుకు ప్రభుత్వాలు మంచి పౌష్టిక ఆహారాని అందించేందుకు కృషి చేయాలనీ ప్రముఖ వైద్యులు డాక్టర్ యలమంచిలి నాగమణి కోరారు. శనివారం ఖమ్మం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినిలు ఆరోగ్య సమస్యలు అనే అంశంపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్ కి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ఎలమంచిలి నాగమణి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థలలో హాస్టల్లో చదువుకునేటువంటి విద్యార్థులకు సరైనటువంటి పౌష్టిక ఆహారాన్ని అందించడంలో ప్రభుత్వం విఫలమవుతుందన్నారు.విద్యార్థినిలకు మెరుగైన వసతులు ప్రభుత్వాలు కల్పించాలన్నారు.ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ,విద్యారంగ సమస్యలు పరిష్కరించే దానికోసం పనిచేసే సంఘం ఎస్ఎఫ్ఐ అని విద్యార్థులు అందరూ ఎస్ఎఫ్ఐ పోరాటాలలో భాగస్వాములై ముందుకు రావాలన్నారు.ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ విద్యార్థినిలకు సమాజంలో ఎదురయ్యేటి సమస్యలు పరిష్కారం కోసం మరింత చైతన్యంతో ముందుకు సాగాలని అలాగే చదువుల్లో ముందుకు సాగేందుకు సమస్త పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ స్ఫూర్తినిస్తుందని ఎస్ఎఫ్ఐ చేసే పోరాటాలలో విద్యార్థినిలు అందరు కూడా ఏకమై మన హక్కుల కోసం మనం ఎస్ఎఫ్ఐ సంఘంతో కలిసి ముందుకెళ్లాలన్నారు.ఈ కార్యక్రమంలో డి.వెంకటేష్, రాజు,వెంకటలక్ష్మి,రాగిణి శ్వేత, శరణ్య,శ్రీలత,పూజిత, స్వాతి, సింధు, పౌర్ణమి,అఖిల, భార్గవి, భవాని మనిషా, లావణ్య, శిరీష, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి అక్రమ మట్టి తవ్వకాలు

### సమాచారం అందించిన స్పందించని సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారులు

**సిద్దిపేట, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** సిద్దిపేట జిల్లా కొండపాక మండల పరిధిలోని ఖమ్మంపల్లి శివారులోని ప్రభుత్వ భూమిలో ఉన్న యేనె గుట్టలను గత వారం రోజులుగా అక్రమ మట్టి వ్యాపారులు ఇటాచ్చి యంత్రాల సహయంతో పెకిలించి టిప్పర్ల ద్వారా జప్తి నాచారం శివారుకు తరలిస్తున్న విషయం సంబంధిత రెవిన్యూ, మైనింగ్ అధికారులకు తెలిసిన పట్టించుకోక పోవడంతో, జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులకు పలువురు సమాచారం అందించినా ఫలితం లేకపోయిందని అంటున్నారు. కొండపాక మండల పరిధిలో ఉన్న సహజ వనరుల్లో భాగమైనవి గుట్టలు కూడా, ఆ గుట్టల మట్టిని కొండపాక గ్రామానికి చెందిన కొంతమంది మట్టి తోడేళ్ళు యథేచ్ఛగా రాత్రిపూట తవ్వకాలు చేపట్టి తరలిస్తున్నప్పటికి, సంబంధిత అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారనే, సిద్దిపేట జిల్లా టాస్క్ పోర్ట్ అధికారులకు నమ్మదగిన సమాచారంతో లొకేషన్ కూడా చేరవేశినా, స్పందించక పోవడం చూస్తుంటే వీరు కూడా మట్టి తోడేళ్లతో చీకటి ఒప్పందం కుదుర్చుకున్నట్లు పలు అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. మండలంలోని పలు గ్రామాల ప్రజలు. జిల్లాలో అక్రమంగా మట్టిని తరలిస్తూ కోట్ల రూపాయలు గడిస్తున్నా వీరు. సంబంధిత శాఖలతో పాటు, పోలీస్ శాఖలకు లక్షల్లో ముడుపులు ముడుతున్నాయని ప్రజారోపణలు బలంగా వినిపిస్తున్నాయి. గుట్టలే కాకుండా మల్లన్న సాగర్, రంగనాయక్ సాగర్ ప్రాజెక్టుల నుండి సాగునీటి కోసం పెద్దఎత్తున తవ్విన కాల్వ మట్టిని ఇరువైపులా సమీప ప్రాంతంలో పోసిన మట్టిని కూడా అక్రమంగా తరలించి లక్షల్లో సొమ్ముచేసుకుంటున్నారు. అక్రమార్కులు అధికారులను మంచి చేసుకొని ప్రభుత్వ భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలు చేపట్టి

లారీల ద్వారా తరలిస్తూ గుట్టలను కనుమరుగు చేసి క్వారీలుగా మారుస్తున్నారు. ఇదంతా ఉదయం రెవిన్యూ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుంటే, రాత్రి పూట గత నాలుగు రోజులుగా ఖమ్మంపల్లి శివారులోని యేనే గుట్ట మట్టిని తరలిస్తున్న వాహనాల విషయం పోలీసులకు తెలిసిన మీన వేషాలు వేయడం చూస్తేనే అర్ధమౌతుందంటున్నారు ప్రజలు. ప్రతి రోజు రాత్రి బౌలు రహదారిపై వ్యతిరేక దిశలో మట్టి లారీల రాకపోకలు చూసిన అధికారులు మిణుకు మనడంలేదంటే దండిగానే ముడుపులు ముడుతునట్లు ఆరోపణలు బలంగ వెలువడుతున్నాయి. అందుకే యధేచ్ఛగా గుట్టలను పల్ల భుములను తవ్వి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని అంటున్నారు ప్రజలు. ఇలా గత కొన్ని నెలలుగా, ప్రభుత్వ పట్టా భూములని తేడా లేకుండా రాష్ట్ర ఖనిజ సంపదను అక్రమంగా కొల్లగొడుతున్న మట్టి మాఫియాను అడిగే నాధుడే లేకపోవడంతో ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయల గండి పడుతుందన వచ్చు, ఇలా అక్రమ మట్టి తవ్వకాలతో లక్షలు హరిస్తు కోట్లకు

పడగలెత్తు తున్నారని స్థానిక ప్రజలు అంటున్నారు. అక్రమ మట్టి వ్యాపారులతో ఇటు మైనింగ్ అధికారులు, అటు రెవిన్యూ, టాస్క్ ఫోర్స్ అధికారులు అండగా ఉండి, చాపకింద నీరులా వ్యవహరిస్తూన్న అధికారుల తీరు చూస్తుంటే ఇట్టే అర్ధమౌతుందంటూ రైతులు విమర్శించారు. ఈ అక్రమ మట్టి తవ్వకాల మాఫియాకు ఎప్పటికప్పుడు అధికారుల కనుసైగ మేరతో కొనసాగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అక్రమార్కులు చేపడుతున్న తవ్వకాల వల్ల భూములు అధికశాతం క్వారీలుగా మారి వ్యవసాయ బావులకు చేరే నీటి ఊటలను దారిమల్లించే విదంగా తయారై రైతు పండించే పంటలకు నీరందకుండా చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

# నేడు ఖమ్మంలో భట్టి సుడిగాలి పర్యటన

## డిప్యూటీ సీఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు

**ఖమ్మం, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** ఖమ్మం జిల్లా కలెక్టరేట్ కు ఆదివారం ఉదయం పలు ప్రారభోత్సవాలకు డిప్యూటీ సీఎం రానున్న నేపథ్యంలో ఏర్పాట్లు పక్కాగా జరగాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, కలెక్టరేట్ లో డిప్యూటీ సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న బస్ స్టాప్, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, ఫీడింగ్ రూమ్, ఎస్.బి.ఐ. బ్యాంకు, భోజనశాలలను పరిశీలించారు. బస్ స్టాప్ పరిశీలన అనంతరం అక్కడ ఉన్న ప్రజలతో కలెక్టర్ ముచ్చటించారు. జిల్లా కలెక్టరేట్ కు వచ్చిన పని వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కలెక్టరేట్ కు వచ్చే వారి సౌకర్యార్థం కలక్టరేట్ వద్ద బస్ స్టాప్ ఏర్పాటు చేయడం వలన నీడతో పాటు, ఆర్టీసి సేవలు సద్వినియోగం చేసుకొని ప్రశాంతంగా ప్రయాణం చేసి తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చని తెలిపారు. వైరా మండలం లింగన్నపేట గ్రామానికి చెందిన నాగేశ్వర్ రావు అనే రైతుతో ఏ పంట సాగు చేస్తున్నారు, దిగుబడి ఎంత వస్తుంది, మొదలగు వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. ఆయిల్ పామ్ సాగు వల్ల లాభం చేకూరుతుందని, మొదటి 3 సంవత్సరాలు అంతర్ పంటల వల్ల ఆదాయం వస్తుందని, ఆయిల్ పామ్ సాగు వైపు దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు.

వరదల వల్ల దెబ్బతిన్న పంట పొలాలకు పరిహారం అందిస్తామని అన్నారు. విద్య, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, ప్రభుత్వ పాఠశాలలను బాగు చేసామని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని, తమతో పాటు తమ చుట్టూ వున్న ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ బడులలో చదివించేలా ప్రోత్సహించాలని తెలిపారు. బీ ఫార్మసీ విద్యార్థి ధీరజ్ తో మాట్లాడి చదువు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సుబ్లేడు గ్రామానికి చెందిన దివ్యాంగురాలు సైదమ్మ దరఖాస్తును కలెక్టర్ పరిశీలించారు. డీఎస్సీ పరీక్షలో ఎంపిక కాలేదని తనకు ఏదైనా పాఠశాలలో టీచర్ ఉద్యోగం ఇప్పించాలని కోరగా, జిల్లా కలెక్టర్ పరిశీలించి అందుబాటులో ఉన్న పాఠశాలలో వాలంటీర్ క్రింద ఎంపిక చేస్తామని, రాబోయే రోజులలో ప్రభుత్వం నిర్వహించే పరీక్షలకు సైతం సిద్ధం కావాలని సూచించారు. వైరా మండలం పాలడుగు గ్రామానికి చెందిన వృద్ధుడు రాజయ్య ఇంటి కొనుగోలు చేసి డబ్బులు చెల్లించలేదని, బెదిరిస్తున్నారని తెలుపగా, వైరా మండల తహశిల్దార్ తో చరవాణిలో కలెక్టర్ మాట్లాడుతూ, ఇంటి విలువ ఇవ్వలేని పక్షంలో ఇంటిని తిరిగి స్వాధీనం చేసుకొని ఇప్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఆదివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నందు పర్యటిస్తారని, కలెక్టరేట్ బస్ స్టాప్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, భోజనశాల, ఫీడింగ్ రూమ్, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ లను ప్రారంభిస్తారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ నిర్వహణ సంఘాల సభ్యులు అందుబాటులో ఉండాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ, డిఆర్డీవో సన్యాసయ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఫిర్యాదులను స్వీకరించిన ఎంపీ శబరి

**నంద్యాల, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** నంద్యాల పట్టణంలో శనివారం ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. నంద్యాల మండలం కానాల గ్రామంలో రైతులు తమ పొలాలకు ఆయకట్టు రోడ్డు వేయించాలని, రైతునగరం, నూనెపల్లె, కానాల గ్రామాల రైతులు నంద్యాల నుంచి జమ్మలమడుగు వరకు 167 జాతీయ రహదారి మంజూరులో గత వైసీపీ ప్రజాప్రతినిధులు, నేతలు వారి రియల్ ఎస్టేట్ భూముల వ్యాపారం వృద్ధి కోసం రైతుల పొలాల్లోకి జాతీయ రహదారి మళ్లించి అన్యాయం చేశారని, న్యాయం జరిగేలా చూడాలని రైతులు కోరడంతో మీ సమస్య ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చేస్తానని ఎంపీ బైరెడ్డి శబరి రైతులకు హామీ ఇచ్చారు. అలాగే నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి ముందు రోడ్డును నమ్ముకొని సుమారు 27 కుటుంబాలు జీవనం సాగిస్తున్నామని, ట్రాఫిక్ కు అంతరాయం అంటూ చిరు అంగల్లు తొలగించారని ఎంపీ శబరికి భాధితులు మొరపెట్టుకో వడంతో జిల్లా ఎస్ పి కి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి భాధితులకు న్యాయం చేయాలని ఎంపీ శబరి కోరగా సోమవారం బాధితులతో మాట్లాడి న్యాయం జరిగేలా చస్తానని జిల్లా ఎస్ పి హామీ ఇచ్చారు. పలు ఉపాధ్యాయ సంఘాల యూనియన్ నాయకులు కూడా వారి సమస్యలు వినతి పత్రాల రూపంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కి విన్నవించారు. అలాగే పాణ్యం, బండి ఆత్మకూరు, ఆళ్లగడ్డ, సిరివెళ్ల, గోస్పాడు మండలాల ప్రజలు తమ సమస్యలు వినతి పత్రాల ద్వారా ఎంపీ శబరి కి విన్నవించారు. మీ సమస్యల పరిస్కారం కోసం పనిచేస్తానని ఎంపీ శబరి భరోసా ఇచ్చారు.

## వేములవాడలో.. అంబేద్కర్ చౌరస్తా నుండి బద్ధిపోచమ్మ ఆలయం వరకు సిసిరోడ్డు

**వేములవాడ, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** వేములవాడ సిసీ రోడ్డు నిర్మాణ భూమిపూజలో ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ తో పాటు మున్సిపల్ చైర్మన్ రామతీర్థపు మాధవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయం నుంచి బద్ధిపోచమ్మ ఆలయం వెళ్లే రహదారి భక్తుల సౌకర్యార్థం సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించుకోవడం సంతోషంగ ఉందని రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించడం వేములవాడ పట్టణంతో రాజన్న ఆలయ అభివృద్ధి కృషిచేయడం జరుగుతుందని వేములవాడ పట్టణాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తూ పట్టణంలో ప్రధాన రహదారిపై ఆగిపోయిన బ్రిడ్జిల నిర్మాణానికి భూసేకరణ కోసం ఇటీవల 6 కోట్ల96 లక్షల నిధులు మంజూరు చేయడం జరిగిందని త్వరలోనే బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయని వేములవాడ పట్టణ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందని త్వరలోనే వేములవాడలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన కూడా ఉంటుందని తెలంగాణ రాష్ట్రంలో ఒకే యార్న్ డిపో మంజూరై 50 కోట్లతో వేములవాడకు కేటాయించడం సంతోషకరమైన విషయం గతంలో యార్న్ కావాలంటే ఇతర రాష్ట్రాలకు వెళ్ళవలసిన పరిస్థితి ఉండేది ఇప్పుడు దీనివల్ల మన ప్రాంతంలో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలోమున్సిపల్అధికారులుకౌన్సిలర్లు పలువురు ఉన్నారు.

## నరకాసుర వధ వాల్ పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి

**వరంగల్, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** ఈ నెల 30వ తారీఖున ఉర్సు గుట్ట వద్ద జరుగు నరకాసుర వద ఉత్సవాలను తిలకించడానికి జిల్లా నలుమూలల నుండి ప్రజలు రావాలని ఆటవి పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ పిలుపునిచ్చారు నరకాసుర వద ఉత్సవ కమిటీ కన్వీనర్ మరుపల్ల రవి ఆధ్వర్యంలో నరకాసుర వధ వాల్ పోస్టర్ ను మంత్రి కొండ సురేఖ, రామ్ నగర్ లోని తన నివాసంలో శనివారం రోజున ఆవిష్కరించినారు పురాణంలో జరిగిన సంఘటనలు నేటి తరానికి తెలియజేయడానికి ఇటువంటి ఉత్సవాలు అవసరమని ఆమె అన్నారు పురాణాల ఆధారముగా చెడు పై మంచి చేసే యుద్దాన్ని నరకాసుర వద గా మంత్రి కొండ సురేఖ అభివర్ణించినరు ఈ కార్యక్రమంలో నరకాసుర వధ ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి శతపతి శ్యామలరావు, సహాయ కార్యదర్శి ఆవునూరి రామ్మూర్తి, ప్రచార కార్యదర్శి మరుపల్ల గౌతమ్, ఆర్గనైజర్ దూడ కొమురెల్లి, మిర్యాల ఆదిత్య, కుండే రాజు, తౌటం నరసింహ, తదితరులు వున్నారు

## నూతన జంటను ఆశీర్వదించిన నిసార్ అహ్మద్

**రామసముద్రం, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** రామసముద్రం మండలంలో దీన్ని పల్లె సమీపంలో గౌతమరాయ స్వామి మోరకొండ కళ్యాణ మండపంలో రామసముద్రం పంచాయతీ గాజుల నగరానికి చెందిన వైసిపి కార్యకర్త గంగాధర కుమార్తె వివాహానికి హాజరై నూతన వధూవరుని ఆశీర్వదించిన ప్రత్యూష వెడ్స్ భాస్కర ఆశీస్సులు అందించిన మదనపల్లి నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ నిసార్ అహ్మద్. ఆయనతోపాటు నాయకులు భాస్కర్ గౌడ్,ప్రకాష్,గంగాధర,మాల మహానాడు మండల ఉపాధ్యక్షుడు మెకానిక్ వెంకటేష్,వెంకటరమణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీని పూర్తి చేసి.. రైతు భరోసాను విడుదల చేయాలి

### రేపు కలెక్టరేట్ వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా

**ఖమ్మం, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రూపాయల రుణమాఫీని తక్షణం అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు డిమాండ్ చేశారు. ఆగస్టు 15 నాటికే పూర్తి చేస్తామన్న రుణమాఫీ ఇప్పటి వరకు సగం కూడా పూర్తి కాలేదని లక్ష లోపు రుణాలు కూడా పూర్తి చేయకపోవడం శోచనీయమన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా సమితి సమావేశం శనివారం స్థానిక గిరిప్రసాద్ భవన్లో దొండపాటి రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో గోవిందరావు మాట్లాడుతూ,రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం దాటవేత ధోరణిని అవలంభిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20లక్షలకు పైగా రైతులకు రుణమాఫీ జరగలేదని ఈ విషయంలో రోజుకో ప్రకటన ఇస్తున్నారని ఇది రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తుందని గోవిందరావు తెలిపారు. రైతుబీమా అమలు చేయడంతో పాటు సన్న వడ్లతో పాటు ఇతర రకాల ధాన్యానికి కూడా రూ.500 బోనస్ ఇవ్వాలని భూ హక్కుల చట్టాన్ని త్వరితగతిన "అమలు చేయాలని గోవిందరావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రూ.15వేల చొప్పున ఖరీఫ్, రబీల్లో ఇస్తానని చెప్పారని కానీ ఖరీఫ్ లో రైతుల ఖాతాల్లో జమ చేయలేదని ఆయన తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి యాసంగి నుంచి రైతు భరోసా అమలు చేస్తామనిచెప్పడంచూస్తుంటేవానాకాలంపంటలకుభరోసాలేనట్లేనని అవగతమ వుతుందన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈనెల 28న సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు గోవిందరావు తెలిపారు. పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, పుచ్చకాయల సుధాకర్,యడ్లపల్లి శంకరయ్య, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## 2026 మార్చి లోపు.. తుడా టవర్స్ నిర్మాణాల పూర్తి

### తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య

**తిరుపతి, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** 2026 మార్చి లోపు తుడా టవర్స్ నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య తెలిపారు. నగరంలోని రాయలచెరువు రోడ్డులో తుడా ఆధ్వర్యంలో నిర్మిస్తున్న తుడా టవర్స్ నిర్మాణ పనులను ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య శనివారం ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం తుడా కార్యాలయంలో అధికారులతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య మాట్లాడుతూ తుడా టవర్స్ ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా 3.6 ఎకరాల స్థలంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నామని అన్నారు. ఇందులో గ్రౌండ్ ఫ్లోర్ తో పాటు 13 అంతస్థులతో తుడా టవర్స్ నిర్మిస్తున్నామని అన్నారు. గ్రౌండ్, ఒకటవ అంతస్థుల్లో 27 దుకాణాలతో వాణిజ్య సముదాయాలు, రెండు, మూడు, నాలుగు అంతస్థులలో ఆఫీస్ ల వినియోగానికి, మిగిలిన అంతస్థుల్లో నివాస యోగ్యంగా ఫ్లాట్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. నివసించేందుకు 230 ఫ్లాట్లు ఉంటాయని, అందులో 42 డబుల్ బెడ్ రూమ్స్,152 ట్రిబుల్ బెడ్ రూమ్స్,4, బెడ్ రూమ్స్ ఫ్లాట్స్ 32 ఉంటాయని అన్నారు. విశాలమైన పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. వాణిజ్య సముదాయాలు, ఫ్లాట్స్ కు వేర్వేరుగా లిఫ్ట్ లు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. 2025 మార్చి లోపు అన్ని పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని అన్నారు. విస్తృతంగా ప్రచారం చేసేందుకు నూతనంగా బ్రోచర్ తయారు చేయించామని ఇందులో అన్ని వివరాలు పొందుపరిచామని అన్నారు. ఈ పరిశీలన సమావేశంలో కార్యదర్శి వెంకటనారాయణ, సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, సలహాదారులు రామకృష్ణ రావు, ఈఈ రవీంద్రయ్య, కె.పి.సి సంస్థ ఈ.డి.సుశీల్ కుమార్, తదితరులు ఉన్నారు.

## ఆసుపత్రుల్లో బయో మెడికల్ వేస్టేజ్ జాగ్రత్తలు తప్పనిసరి

### డాక్టర్.తోసిఫ్ సయ్యద్

**వికారాబాద్, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** రోగులకు వైద్య సేవలు అందించే సమయంలో, డాక్టర్లు రోగులకు శస్త్ర చికిత్స చేస్తున్న సమయంలో వైద్య సిబ్బంది బయో మెడికల్ వేస్టేజ్ మేనేజ్మెంట్ జాగ్రత్తలు తప్పనిసరి పాటించాలని మైక్రో బయాలజీ విభాగం సీనియర్ రెసిడెంట్ డాక్టర్ తోసిఫ్ సయ్యద్ వెల్లడించారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని జనరల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రామచంద్రయ్య, మైక్రో బయాలజీ విభాగపు అధికారిణి డాక్టర్ గంగాభవాని సూచనల ప్రకారం డాక్టర్ తోసిఫ్ నర్సింగ్ సిబ్బందితో, ప్రయోగశాల సిబ్బందితో, విద్యార్థులకు బయో మెడికల్ వేస్టేజ్ మేనేజ్మెంట్ జాగ్రత్తలను అనుసరించి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య సేవలు అందించే సమయంలో బయో మెడికల్ వేస్టేజ్ ద్వారా ఇన్ఫెక్షన్ ప్రభావం సోకకుండా ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సూచించారు. బయో మెడికల్ వ్యర్థాలను తొలగించడానికి జాగ్రత్తలు పాటించడం విస్మరించడం వలన రోగికి ఉండే తదితర వ్యాధులు వైద్య సిబ్బందికి, పరిశుభ్రత కార్మికులకు ఇన్ఫెక్షన్స్ సోకే ప్రమాదం ఉందని తెలిపారు. దీంతో ఆసుపత్రి మొత్తం సిబ్బందికి సోకే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కావున చేతి శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించడం విస్మరించకూడదని సూచించారు. పైన సూచించిన బయో మెడికల్ వేస్టేజ్ మేనేజ్మెంట్ పద్ధతులను పాటించడం విస్మరిస్తే ప్రాణానికే ప్రమాదం సంభవించే ఆస్కారం ఉందని పేర్కొన్నారు. రోగులకు సూదులు ఇచ్చే సమయంలో డాక్టర్లు సూచించిన పద్ధతులను, జాగ్రత్తలను తప్పనిసరి పాటించాలని వెల్లడించారు. బయో మెడికల్ వేస్టేజ్ మేనేజ్మెంట్ పద్ధతులు పాటించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని తెలిపారు. బయో మెడికల్ వేస్టేజ్ మేనేజ్మెంట్ పద్ధతులు పాటించి ఆసుపత్రి ఉన్నత నాణ్యత ప్రమాణాల వైద్య సేవలు పెంచుదామని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సిబ్బంది, ప్రయోగశాల సిబ్బంది, ఐసిటిసి కౌన్సలర్ రత్నాకర్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## వరంగల్ జిల్లా కళాకారుల సంఘ అధ్యక్షునిగా సందీప్

**వరంగల్, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** తెలంగాణ ఉద్యమ కారులా ఫోరం రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రాష్ట్ర కళాకారుల విభాగం కన్వీనర్ ఎల్లా పోశెట్టి వరంగల్ జిల్లా అధ్యక్షులుగా పోలేపాక సందీప్ ని నియమిస్తూ నియామక పత్రాన్ని శనివారం ఇవ్వడం జరిగింది. గత 20 సంవత్సరాలుగా కళా రంగంలో ఉంటూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ధూమ్ దాం సకలజనుల సమ్మె వంటావార్పు రైల్ రోకో నిరాహార దీక్షలో పాల్గొంటూ తన వంతు బాధ్యతగా తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కళాకారునిగా కళాబృందం తోటి అనేక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం జరిగింది. రాష్ట్రం సిద్ధించాక, గత పది సంవత్సరాలుగా నిరుద్యోగ కళాకారులకు ఉద్యోగాలు కల్పించాలని,అర్హులైన కళాకారులకు సబ్సిడీ ద్వారా ఉపాధి కల్పించాలని, అర్హులైన పేద కళాకారులకు, సొంతిల్లు నిర్మించాలని తెలంగాణ రాష్ట్ర కళాకారుల నాయకులు గడ్డం సుధాకర్ వరంగల్ లో పని చేస్తున్నందుకు గుర్తించి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం వరంగల్ జిల్లా కళాకారులు విభాగం అధ్యక్షునిగా నియమిస్తున్నట్టు తెలియజేయడ మైనది ఎల్ల పోశెట్టి వివరించారు. ఈ అవకాశం కల్పించిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు సీమ శ్రీనివాసరావు, రాష్ట్ర కన్వీనర్ఎల్ల పోశెట్టి, ఉమ్మడి వరంగల్ జిల్లా కళాకారుల సంఘ నాయకులు గడ్డం సుధాకర్ లకు సందీప్ కృతజ్ఞతలు తెలిపారు. వీరిఎన్నికపట్లపలువురు రాష్ట్ర ఉద్యమకారుడు కొల్లూరి యోగానంద్, కర్ని రవీందర్ మండల నరసింహా రాములు కత్తెరపల్లి వేణు కొండ్రెడ్డి నవీన్ రెడ్డి బక్కి రంజిత్ జినుక రమేష్ వేల్పుకొండ రాజేష్‌లు అభినందనలు తెలిపారు. అనంతరం సందీప్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఎలాంటి కార్యక్రమాల కైనా ముందుండి ముందుకు తీసుకెళ్తానని తెలిపారు.

## శ్రీ కోట మైసమ్మ దేవాలయం వద్ద భక్తుల దీనస్థితి

- ఆలయ భూములపై దేవదాయ శాఖకు అందిన ఫిర్యాదులు
- ఆరా తీస్తున్న సచివాలయం

**సింగరేణి/ ఖమ్మం, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** ఉసిరికాయ ల పల్లి లోని శ్రీ కోట మైసమ్మ అమ్మవారి దేవాలయం చరిత్ర గొప్పది. అయితే ఆలయ భూముల విషయంలో లీలలు ఎన్నో తవ్విన కొద్దీ చాలా రహస్యాలు బయట పడుతున్నాయి. ప్రజల్ని మోసం చేశారు సరే, కానీ ప్రజల నమ్మకాలను కూడ మోసం చెయ్యడం ఎలా అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఖమ్మం జిల్లా పరిధిలోని సింగరేణి మండలంలోని ఉసిరికాయల పల్లిలో చారిత్రాత్మకమైన ఈ ఆలయం యాత్ర జరిగినప్పుడల్లా లక్షలాదిమంది భక్తులు అయితే దేవదాయశాఖ నిర్లక్ష్యం, అక్కడ పాలకవర్గం పేరిట జరుగుతున్న అక్రమాలు భక్తులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ప్రభుత్వాన్ని, అధికారుల్ని ఎలా పట్టీ కొట్టించారు విచిత్రం. 548/145 సర్వే నెంబర్ గల భూమి అసలు మీదే కాదు అనే చర్చ ఉంది. అది బోడ అనిల్ తండ్రి పేరు భద్రు అనే వ్యక్తికి సంబదించినది. అది కూడ తెలంగాణా ప్రభుత్వ ఆవిర్భావానికి ముందే అంటే సుమారుగా ఒక నేల ముందే. అంటే 02జూన్ 2014 తెలంగాణా ఆవిర్భావం జరిగింది. అయితే ఈ సందర్భంగా అనేక అక్రమాలకు తెరలేవడం విశేషం. తమరి కానీ తమరి భూమిని తమరు ఏకంగా తెలంగాణా ప్రభుత్వ పాలనా మొదలవ్వక మునుపే 01 మే2014నే దేవాదాయ ధర్మాదాయ శాఖ కు ఏలా రాసిచ్చారు అనేది ప్రశ్న. ఈ అంశం పై పూర్తి వివరాలు డాక్యు మెంట్స్ మెయింటనెన్స్ గురించి తెలుసుకోవడానికి వెళ్లిన వారికి విచిత్రమైన పరిస్థితి ఎదురైంది. వీరు వ్యవహరిస్తున్న తీరుని ఏమనాలో అర్థం కాలేదు. దేవాలయ ప్రాంగణంలో ఉన్న, ఎప్పుడో కట్టించిన మూడు నాలుగు బాత్రూంలు మెయింటనెన్స్ లేక నిరూపయోగంగా మారి శిధిలావస్థకు చేరుకుంది. దాని వెనకాలే గత్యంతరం లేక ముగ్గురు నలుగురు అమ్మ వారి దర్శనార్థం వచ్చిన మహిళా భక్తులు ఓపెన్ ఏరియాలో స్నానం చేస్తుండటం ఇక్కడ దీనస్థితికి అద్దంగా నిలిచింది.

## రాయచోటిలో సిపిఐ నూతన కార్యవర్గం

**రాయచోటి, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** రాయచోటి నియోజకవర్గం రాయచోటి సిపిఐ పట్టణ కమిటీ సభ్యుల సమావేశం జిల్లా పార్టీ కార్యాలయంలో జగన్ బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిపిఐజిల్లాకార్యదర్శిపిఎల్నరసింహులు నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ళ శ్రీనివాసులు దళిత కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్ కుమార్ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు కత్తి సురేంద్ర పాల్గొన్నారు. అనంతరం పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు.

## పెట్రోల్ బంక్‌లో మంటలు

**ఉప్పల్, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** నాచారం పీఎస్ పరిధిలో పెట్రోల్ బంక్లో పెను ప్రమాదం తప్పింది. మల్లాపూర్లో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్లో పెట్రోల్ పోస్తుండగా ఆకతాయిలు నిప్పు పెట్టారు. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన బంక్ సిబ్బంది వెంటనే మంటలను ఆర్పివేశారు. గంజాయి మత్తులో ఉన్న యువకులు నిప్పు పెట్టినట్లు సిబ్బంది తెలిపారు. యాజమాని ఫిర్యాదు మేరకు యువకులను నాచారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## టీఎస్ఐఐసి ఫిర్యాదుతో మట్టి మాఫియా అరెస్ట్

**మనోహరాబాద్, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోనీ కొండాపూర్ శివారులో గల టిఎస్ఐఐసి సంబంధించిన భూమిలో కొండాపూర్ మరియు ఇతర గ్రామాలకు సంబంధించిన వ్యక్తులు పది టిప్పర్లు ఐదు హిటాచీలు పెట్టి లాభపేక్షాను ఆశించి డబ్బులకు మట్టిని తరలించడం జరుగుతుంది. టీఎస్ ఐఏసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేయడం జరుగుతుందనీ సీఐ రంగకృష్ణ తెలిపారు. అంతేకాకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న కొందరు వ్యక్తులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. ఈ అక్రమ మట్టి తనిఖీలో ఎస్ఐ సుభాష్ గౌడ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## కబడ్డీ విజేతలుగా విజ్ఞాన్స్ బోట్రీ కేంద్రీయ విద్యాలయం

**హైదరాబాద్, అక్టోబర్26 (నిఘా న్యూస్):** ఎస్ఎఫ్ఏ ఛాంపియన్‌షిప్ -24 ఎడిషన్‌లో 12వ రోజు యువ క్రీడాకారులకు సరికొత్త అనుభూతిని ఇచ్చింది. తమిళ తలైవాస్‌కు చెందిన ప్రో కబడ్డీ లీగ్ స్టార్స్ నరేందర్ కండోలా, సచిన్ తన్వర్, బెంగళూరు బుల్స్‌కు చెందిన అజింక్యా పవార్ శనివారం కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంను సందర్శించారు. హైదరాబాద్‌కు చెందిన యువ కబడ్డీ ఆటగాళ్లను అభినందించి వారిలో ఉత్సాహం, స్ఫూర్తిని అందించారు. పీకేఎల్ స్టార్ల మాటలతో స్ఫూర్తి పొందిన విజ్ఞాన్స్ బో ట్రీ స్కూల్(నిజాంపేట) జట్టు అండర్14 బాలుర కబడ్డీ ఫైనల్లో రెయిన్‌బో స్కూల్(చింతల్)పై స్ఫూర్తిదాయకమైన విజయం సాధింది. గచ్చిబౌలి కేంద్రీయ విద్యాలయం జట్టు అండర్ 14 బాలికల కబడ్డీ ఫైనల్‌లో స్వర్ణం సాధించింది. మరోవైపు గచ్చిబౌలి స్టేడియం బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, వాలీబాల్, ఫుట్‌బాల్ పోటీలు ఉత్కంఠగా సాగాయి. అండర్-16 బాలికల వాలీబాల్ టైటిల్‌ను శేరిలింగంపల్లి కార్డర్‌స్టోన్ స్కూల్ గెలుచుకోగా, అండర్-16, అండర్-18 బాలుర వాలీబాల్ ఫైనల్స్‌లో మేధ్చల్ విజ్ఞాన్ గ్లోబల్ జెన్ స్కూల్, గచ్చిబౌలి కేంద్రీయ విద్యాలయం విజేతలుగా నిలిచాయి. ఫుట్‌బాల్‌లో భాజాగూడ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ జట్లు అండర్ -16, అండర్ -18 బాలుర విభాగాల్లో స్వర్ణాన్ని గెలుచుకుని తన ఆధిపత్యాన్ని చాటుకుంది.

# కిలోల లెక్కన కొని
# అందిన కాడికి దోపిడీ

- టపాసుల వ్యాపారాలపై సమగ్ర విచారణ జరపాలి
- కౌన్సిల్ ఫర్ సిటిజెన్ రైట్స్ సంస్థ
- కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అంజేసిన సిసిఆర్

**సిద్దిపేట, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** రాష్ట్రంలో దీపావళి పండుగను పురస్కరించుని, సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న అక్రమ టపాసుల వ్యాపారలపై సమగ్ర విచారణ చేపట్టి, ప్రభుత్వ ఖజానాకు గండి పడకుండా చూడాలని కోరుతూ శనివారం సిద్దిపేట పట్టణ కౌన్సిల్ ఫర్ సిటిజెన్ రైట్స్ సంస్థ, సెంట్రల్ ఫర్ లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిసి ఆర్ సంస్థ జిల్లా అధ్యక్షుడు గుండ్ల శివ చంద్రం, సెంట్రల్ కమిటీ కార్యదర్శి సాజిద్ మాట్లాడుతూ దీపావళి పండుగను పురస్కరించుకొని సిద్దిపేట జిల్లా పరిధిలోని గజ్వేల్, దుబ్బాక,హుస్నాబాద్, చేర్యాల వంటి నగర, పట్టణ మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న టపాసుల విక్రయ కేంద్రాలలో ప్రతి యేటా జరుగుతున్న మోసాలను అరికట్టాలని అన్నారు.

ఈ టపాసుల దుకాణాలను ఏర్పాటు చేయాలంటే సుమారు ఏడు ప్రభుత్వ శాఖల అనుమతులను పొంద, అలాంటిది. ఏలాంటి అనుమతులు లేకుండా సాదాపేపర్ పై తాత్కాలిక బిల్లులను ఇచ్చి జీరో బిసినెస్‌కు తేర లేపుతారని, ఏళ్లతరబడి ప్రతి యేటా వస్తున్న ఆరోపణలకు స్వస్థి పలకాలంటే అధికారులు పారదర్శకంగా తనిఖీలు చేపట్టి వినియోగదారుల జేబులు చిల్లులు పడకుండా చూడాలన్నారు. అక్రమ టపాసుల చీకటి వ్యాపారంలో వెలువడుతున్న బహిరంగ రహస్యమే జీరో బిల్లుల వ్యవహరమని అన్నారు. ఇక టపాసుల ఎం ఆర్ పి రేట్లు చూస్తే మతిపోతుందని ఎమ్మార్పి ఎంత నిర్ణయించాలి అన్న విషయం పై అవగాహన లేదన్నారు. శివ కాశి నుండి కిలోల లెక్కన తెచ్చి ఇక్కడ రెండు మూడు రోజుల పాటు అందినకాడికి దోచుకుంటారని ఆరోపణలు కొన్ని సంవత్సరాల నుండి వినిపిస్తున్నయి. ఇదంతా పండుగ వరకే ఉంటుందని ఆ తర్వాత ఎవరి పనుల్లో వాళ్ళు బిజి అయిపోతా రన్నారు. ఈ విషయం పై సీసీ ఆర్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామని ఈ సంవత్సరం టపాసుల వ్యాపారంపై సమగ్ర విచారణ చేపట్టి ప్రభుత్వ ఖాజనకు, అలాగే సామాన్యులా జేబులకు చిల్లు కొడుతున్న వ్యాపారులపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని కొరమాన్నారు.

## కాంగ్రెస్ నేత సతీష్ కుటుంబాన్ని ఆదుకుంటాం

దశదినకర్మకు హాజరై నివాళులు అర్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**నారాయణపేట, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శనివారం నారాయణపేట జిల్లా మద్దూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు స్వర్గీయ సతీష్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన సతీష్ తల్లిదండ్రులు, భార్యా పిల్లలతో పాటు ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాగా మద్దూర్ కు చెందిన కాంగ్రెస్ నాయకుడు సతీష్ ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి హెలికాప్టర్ ద్వారా మద్దూరుకు చేరుకొని సతీష్ స్వగృహంలో నిర్వహించిన దశ దినకర్మ కార్యక్రమానికి హాజరయ్యారు. సతీష్ కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా సతీష్ భార్య సంగీత తన ఇద్దరు కుమారులు వీరేష్, ఆదిత్య ల ఉన్నత చదువులకు సాయం చేయాలని సీఏం ను కోరగా అందుకు సీఎం సానుకూలంగా స్పందించారు. జాతీయస్థాయిలో వాలీబాల్ పోటీలలో ప్రతిభ చాటిన సతీష్ తమ్ముడు మణికంఠ తనకు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశం ఇప్పించాలని రెజూమ్ ను సీఎం రేవంత్ రెడ్డికి అందజేయగా పరిశీలించాలని కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి ని సీఎం ఆదేశించారు. అలాగే సతీష్ సోదరి వీరమణి బిడిఎస్ పూర్తి చేసిన తన కొడుకుకు ఉద్యోగ అవకాశం కల్పించాలని సీఎం కు విన్నవించారు. సతీష్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని సీఎం భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిడి శ్రీహరి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ట్రైనీ కలెక్టర్ గరి మానరుల, జోగులాంబ గద్వాల జోన్ -7 డి ఐ జి ఎల్.ఎస్. చౌహాన్ , జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ వార్ల విజయకుమార్, మద్దూరు జెడ్పిటిసి రఘుపతి రెడ్డి, డిసిసి అధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఖమ్మం కార్పొరేషన్‌లో అవినీతి తిమింగలాలు

- ఉన్నతాధికారుల మౌనంపై అనుమానాలు
- అవినీతి అధికారులపై చర్యలు తీసుకోండి
- ఏఐటియుసి డిమాండ్

**ఖమ్మం, అక్టోబర్ 26(నిఘా న్యూస్):** నగర పాలక సంస్థలో అవినీతికి పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐటియుసి డిమాండ్ చేసింది. నగర పాలక సంస్థలో భారీ ఎత్తున అవినీతి జరిగిందని గత కలెక్టర్ పలుమార్లు టౌన్ ప్లానింగ్ అధికారులను హెచ్చరించినా తమ తీరు మార్చుకోలేదని ఏఐటియుసి నేతలు తెలిపారు. ఏఐటియుసి జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు గాదె లక్ష్మి నారాయణ తోట రామాంజనేయులు, జిల్లా కార్యనిర్వహక అధ్యక్షులు రావిశివరామకృష్ణ తదితరులు ఏఐటియుసి సమావేశంలో మాట్లాడుతూ 2018 నుంచి 2023 సంవత్సరం వరకు జరిగిన అవినీతి పనుల్లో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లపైన విజిలెన్స్ విచారణ జరిపించాలని ఏఐటియుసి నేతలు ఆడిమాండ్ చేశారు. క్రింది స్థాయి అధికారులను తమ అధికారంతో చెప్పు చేతల్లో ఉంచుకుని ఒక అవినీతి వలయాన్ని ఖమ్మం కార్పోరేషన్లో ఏర్పాటు చేశారని వారు తెలిపారు. కాంట్రాక్టర్లకు సహకరిస్తూ కార్మికులకు వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్న అధికారులపై విచారణ జరిపించాలని విజిలెన్స్ విచారణ తర్వాత నివేదికను ప్రజల ముందు ఉంచాలని ఏఐటియుసి డిమాండ్ చేసింది. పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచాలని 2018లో జనరల్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం. అధికారుల అలసత్వం,కాంట్రాక్టర్లతో మిలాఖత్ కారణంగానే అమలు చేయలేదన్నారు. నగర పాలక సంస్థలో బిల్ కలెక్టర్ నుండి ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ వరకు అవినీతిలో మునిగారన్న వార్తలు వినిపిస్తున్న ఉన్నతాధికారులు ఎందుకు మౌనం పాటిస్తున్నారని నాలుగైదేళ్లుగా కార్పోరేషన్ పాలనను పక్కదారి పట్టిస్తున్న అధికారులపై చర్యలు ఎందుకు తీసుకోలేదని వారు ప్రశ్నించారు. విచారణ జరిపి తక్షణం పక్కదారి పట్టిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, చర్యలు తీసుకోని పక్షంలో ఏఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.

## వేములవాడ టెంపుల్ పరిధిలోకి 152 గ్రామాలు

### టెంపుల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ పరిధి పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు

**వేములవాడ, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** అభివృద్ధి కోసం పరిధి పెంచినట్లు ఉత్తర్వులో పేర్కొన్న ప్రభుత్వం. వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ వీటిడిఏ పరిధి పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో వేములవాడతో పాటు వేములవాడ అర్బన్ మండలం వీటిడీఏ పరిధిలో ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల మున్సిపాలిటీతో పాటు బోయినపల్లి, ఇల్లంతకుంట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, ముస్తాబాద్, గంభీరావుపేట,చందుర్తి, రుద్రంగి,వేములవాడ రూరల్, కోనరావుపేట మండలాల్లోని 152రెవెన్యూ గ్రామాలను వీటిడిఏ పరిధిలోకి తీసుకొస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇకనుండి ఆయా మండలాల్లోని గ్రామాలు వీటీడీఏ పరిధిలోకి త్వరలో రానున్నాయి.

## సర్పంచులకు పెండింగ్ బిల్లులు ఇవ్వండి

### అప్పుల బాధతో ఆత్మహత్యలకు సిద్ధమవుతున్నారు

### సర్పంచుల రిలే నిరాహార దీక్షకు జిల్లా బహుజన సేన మద్దతు

**రాజన్నసిరిసిల్ల, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** తొమ్మిది రోజులుగా సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తాజా, మాజీ సర్పంచులు చేస్తున్న రిలే నిరాహార దీక్షకు బహుజన సేన రాజన్న సిరిసిల్ల ఆర్గనైజేషన్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బహుజనసేన అధ్యక్షుడు జింక శ్రీధర్ మాట్లాడుతూ దేశానికి పల్లెలే పట్టుకొమ్మలని చెప్పే ప్రభుత్వాలు గ్రామ సర్పంచుల పెండింగ్ బిల్లులు ఇవ్వక పోవడం చాలా బాధాకరమని, సర్పంచుల కుటుంబాలు అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తాజా మాజీ సర్పంచులకు న్యాయం చేయవలసిందిగా కోరారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తాజా, మాజీ సర్పంచుల జేఏసీ అధ్యక్షుడు అక్కనపల్లి కరుణాకర్ బహుజన సేన నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బహుజన సేన నాయకులు లక్కే సాగర్, ఆరెల్లి రాజు, నేదురు శ్రీకాంత్, లక్కే దినాకర్, కుమ్మరి దీపక్, అలవాల రాము, భూముల ప్రశాంత్, ముత్త మధు, అన్నవేని రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## క్యారం పోటీలలో క్వార్టర్స్ ఫైనల్‌కు చేరిన ఆదిత్య

**హైదరాబాద్, అక్టోబర్ 26(నిఘా న్యూస్):** రంగారెడ్డి జిల్లా గొల్లూరు సిబిఆర్ ప్రసాద్ క్రీడా ప్రాంగణంలో శనివారం రెండవ రోజు రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ క్యారం పోటీలు జరిగాయి. ఈ పోటీలలో ఆదిత్య,సూర్యప్రకాష్, ఎమ్. ఏ. హకీంలు క్వార్టర్స్ ఫైనల్ కు చేరారు. ఎస్. ఆదిత్య, వి. ఎస్.కె. నాయుడు పై 25-1,25-5 స్కోర్ తో, బాలగంగా పూజ్రా, మహమ్మద్ పై 18-23,23-12,25-8 స్కోర్ తో, యు. నరేష్, సాగర్ పై 25-10,25-6 స్కోర్ తోవిజయం సాధించారు. అలాగే షైక్ సమీర్, నవీన్ పై,18-11,18-17 స్కోర్ తో, ఎమ్. ఏ హకీం, జాఫర్ పై 25-4,25-8 స్కోర్ తో, సోను చౌధరీ, విశ్వజేత పై 25-10,25-3 స్కోర్ తో విజయం సాధించారు. ఎల్. సూర్యప్రకాష్ , ఆర్.డి దినేష్ బాబు పై 25-5,25-6 స్కోర్ తో గెలుపొందారు.

# శిలా ఫలకాలపై...
# మారుతున్న ముఖ్యమంత్రుల పేర్లు

- అయినా ఒక్క అడుగు ముందుకు వేయని కడప ఉక్కు కర్మాగారం
- ఈనెల 29, 30 తేదీలలో డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు

**ప్రొద్దుటూరు, అక్టోబర్ 26 (నిఘా న్యూస్):** భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ సమావేశాలు ఈనెల 29,30న రెండు రోజులు కడప వేదికగా జరుగుతున్నాయని వాటిని జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. శనివారం ఆయన ఈ విషయమై రాష్ట్ర కమిటీ సమావేశాల కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ఈ రాష్ట్ర కమిటీ సమావేశాలకు అఖిల భారత అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఎంపీ ఏ. ఏ.రహీమ్ ముఖ్య అతిథిగా హాజరు అవుతున్నారని, అలాగే రాష్ట్రం నలుమూలల నుండి రాష్ట్ర నాయకత్వం సమావేశాలకు హాజరు అవుతున్నారని వివరించారు. ఈ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో కడప ఉక్కు రాష్ట్ర విభజన హామీలు అమలే అజెండాగా తీసుకొని చర్చించడం జరుగుతుంది అన్నారు. ముఖ్యంగా విభజన హామీలలో ప్రధాన డిమాండ్ అయిన కడప ఉక్కును కేంద్రం నిర్లక్ష్యం వహిస్తూ కాలం గడుపుతూ వస్తున్నది అన్నారు. సంవత్సరాలు గడుస్తున్నా కడప ఉక్కుకు పునాది రాయి పడలేదు అన్నారు. ముఖ్యమంత్రులు వేసిన పునాదిరాళ్లు మారుతున్నాయే తప్ప కడప ఉక్కు శంకుస్థాపన మాత్రం జరగలేదు అన్నారు. అలాగే రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పినా కేంద్రం అది అమలు సాధ్యం కాదని దటవేసింది అన్నారు. కేంద్రాన్ని నిలదీసి రాష్ట్ర హక్కులు రాబట్టడంలో వైఎస్ఆర్సీపీ, టిడిపి, జనసేన విఫలం చెందాయి అన్నారు. అలాగే కడప కొప్పర్తి పారిశ్రామిక కారిడార్ లో ఉన్న ఎం ఎస్ ఎం ఈ టెక్నాలజీ కేంద్రాన్ని కూడా అమరావతికి రాష్ట్ర ప్రభుత్వం తరలించడం ఇక్కడి ప్రాంత ప్రజలను అవమానించడమే అన్నారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంత యువతకు ఉద్యోగ అవకాశాలు కలగాలంటే ఉపాధి పరిశ్రమ ఏర్పాటు మార్గం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా

కేంద్రాన్ని నిలదీసి రాష్ట్ర హక్కులను సాధించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈనెల 29 30న రెండు రోజులపాటు జరిగే రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ నాయకులు విశ్వనాథ్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com